తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

ఖమ్మం - నల్లగొండ

భద్రాద్రి కొత్తగూడెం | సూర్యాపేట | యాదాద్రి భువనగిరి

గురువారం 02 జూలై 2026 | పేజీలు : 8



Follow :




○అధిక ఫీజులు, పుస్తకాల దోపిడీ, ఫిట్‌నెస్ లేని బస్సులు.. పర్యవేక్షణ కరువు ○ తనిఖీలు చేపట్టని మండల విద్యాశాఖ అధికారి ○ తల్లిదండ్రులపై ఆర్థిక భారం.. విద్యార్థుల భద్రతపై ఆందోళన

**పి.ఏ.పల్లి, జూలై 1 (జనంసాక్షి):** పి.ఏ.పల్లి మండలంలో ప్రైవేట్ పాఠశాలల నిర్వహణపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలు అమలవుతున్నాయా? విద్యార్థుల భద్రతకు తగిన చర్యలు తీసుకుంటున్నారా? లేక యాజమాన్యాల ఇష్టారాజ్యమే కొనసాగుతోందా? అనే సందేహాలు తల్లిదండ్రులు, ప్రజా సంఘాలు వ్యక్తం చేస్తున్నాయి. మండల విద్యాశాఖ అధికారులు తనిఖీలు చేపట్టకపోవడంతో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తమకు నచ్చిన విధంగా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల నుంచి భారీ మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ,ఆ స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలల ప్రాంగణాల్లో పిల్లలు ఆడుకునేందుకు తగిన ఆటస్థలాలు లేకపోవడం,విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు లేకపోవడంతో చిన్నారులు క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది.

**పుస్తకాల పేరుతో దోపిడీ..ప్రమాదాలకు ఆహ్వానం పలుకుతున్న స్కూల్ బస్సులు:**

కొన్ని ప్రైవేట్ పాఠశాలలు బయట మార్కెట్‌లో లభించే పుస్తకాలను కొనుగోలు చేయనివ్వ కుండా, యాజమాన్యమే నిర్ణయించిన పుస్తకాలు, నోట్‌బుక్స్‌ను అధిక ధరలకు విక్రయిస్తున్నాయని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభంలోనే వేల రూపాయల అదనపు భారం పడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై విద్యాశాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని

మిగతా 8లో



## సాగుకాలం దాటిపోతుందని ధర్మారెడ్డి పల్లి ఆయకట్టు రైతులలో ఆందోళన

సాగునీటి కోసం రైతుల పక్షాన పోరుబాట పట్టనున్న సిపిఎం

ధర్మారెడ్డి పల్లి కాలువకు ఈనెల 10న నీటిని విడుదల చేయాలి

లేకుంటే 11న నీటిని మేమే విడుదల చేస్తాం

రెండో వారంలోనే నీటిని విడుదల చేసేందుకు సిద్ధమవుతున్న అధికారులు

**యాదాద్రి, కరస్పాండెంట్ జూలై 1 (జనంసాక్షి)**

ధర్మారెడ్డి పల్లి కాలువ ధర్మారెడ్డి పల్లి కత్వ నుండి ప్రారంభమై పోచంపల్లి, వలిగొండ, రామన్నపేట, చిట్యాల మండలంలోని పదుల సంఖ్యలోని గ్రామాల గుండా వందలాది మంది రైతుల వేలాది ఎకరాల భూముల సాగుకు నీటిని అందిస్తూ రైతుల కండ్లల్లో ఆనందం అందిస్తుంది. అటువంటి ధర్మారెడ్డిపల్లి కాలువ మరమ్మతుల కారణంగా నీటి విడుదల నిలిపివేయడంతో వందలాది మంది రైతులు సాగు భూములు బీడు భూములుగా మారి ఇప్పటికే రైతులు ఒక పంట కోల్పోవడం జరిగింది. దీంతో రైతులు, రైతు కూలీలు పంటల సాగు లేక పనులు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. అయితే ఒక పంట పోయిన మరొక పంటకి నీటి విడుదల జరుగుతుందని ఆశతో ఉన్న రైతులకు నేటికీ మరమ్మతులు పూర్తి కాకపోవడంతో సాగుకాలం దాటిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ధర్మారెడ్డి పల్లి కాలువ

మిగతా 4లో

## అంబేద్కర్ విగ్రహం చుట్టూ కాంగ్రెస్ పార్టీ హంగులు

○రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతమేనా..? అంబేద్కర్ వాదుల ఆగ్రహం

○జెండాలు, తోరణాలు తొలగించాలని డిమాండ్

**నల్లగొండ, జూలై 1 (జనంసాక్షి):**
నల్లగొండ పట్టణంలోని కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే ప్రధాన కూడలి వద్ద ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం చుట్టూ కాంగ్రెస్ పార్టీ జెండాలు, హస్తం గుర్తుతో కూడిన తోరణాలు ఏర్పాటు చేయడం వివాదానికి దారితీసింది. ఈ చర్య రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని అంబేద్కర్ వాదులు, దళిత సంఘాలు ఆరోపిస్తుండగా, కాంగ్రెస్ పార్టీ నుంచి అధికారిక స్పందన రావాల్సి ఉంది.

కలెక్టరేట్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహం ప్రజలకు ప్రముఖ గుర్తింపుగా నిలుస్తోంది. విగ్రహం చుట్టూ ఏర్పాటు చేసిన రక్షణ కంచెకు కాంగ్రెస్ పార్టీ జెండాలు, హస్తం గుర్తుతో కూడిన తోరణాలు కట్టినట్లు స్థానికులు గమనించారు. విగ్రహం పునాదిలో “కాన్స్టిట్యూషన్ ఆఫ్ ఇండియా” నమూనా, ఇరువైపుల అశోక స్తంభాలు ఉండగా, వాటి మధ్య రాజకీయ పార్టీ అలంకరణలు కనిపించడం చర్చనీయాంశంగా మారింది.

సాధారణంగా అంబేద్కర్ జయంతి, వర్ధంతి, రాజ్యాంగ దినోత్సవం వంటి సందర్భాల్లో పూలమాలలు, విద్యుత్ దీపాలతో అలంకరించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. అయితే రాజకీయ పార్టీ జెండాలు, గుర్తులతో విగ్రహాన్ని అలంకరించడం సరైన పద్ధతి కాదని అంబేద్కర్ వాదులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.”డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఏ ఒక్క రాజకీయ పార్టీకి చెందిన నాయకుడు కాదు.




ఆయన దేశ ప్రజలందరికీ చెందిన మహనీయుడు. రాజ్యాంగం అన్ని రాజకీయ పార్టీలకూ అతీతమైన పవిత్ర గ్రంథం. అలాంటి మహనీయుడి విగ్రహాన్ని పార్టీ జెండాలతో అలంకరించడం రాజ్యాంగ గౌరవాన్ని దెబ్బతీసే చర్య” అని పలువురు దళిత, అంబేద్కర్ సంఘాల ప్రతినిధులు పేర్కొంటున్నారు. ”ఇవాళ ఒక పార్టీ ఇలా చేస్తే, రేపు మరో పార్టీ కూడా అదే విధంగా వ్యవహరించే పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో మహనీయుల విగ్రహాలకు ఉండాల్సిన సార్వజనీన గౌరవం దెబ్బతింటుంది” అని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఆరోపణలపై కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకత్వం స్పందన కోసం ప్రయత్నించినప్పటికీ, వార్త రాసే సమయానికి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. పార్టీ కార్యకర్తలు అభిమానంతో అలంకరణ చేపట్టారా, లేక ఏదైనా ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఈ ఏర్పాట్లు చేశారా అన్న విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ం ప్రకారం జాతీయ చిహ్నాలు,

మిగతా 4లో

# భావి భారత ప్రధాని అఖిలేష్ యాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్న యాదవులు

### జిల్లా డిసిసిబి డైరెక్టర్ మాజీ జడ్పిటిసి సభ్యుడు మల్లి బాబు యాదవ్



**కామేపల్లి,జూలై 1 (జనంసాక్షి):** ఖమ్మం జిల్లా ఇల్లందు నియోజక వర్గం లోని కామేపల్లి మండలం పరిధిలోని పండితాపురం గ్రామం లో డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ ఆధ్వర్యంలో ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్ వాది పార్టీ జాతీయ అధ్యక్షులు, అఖిలేష్ యాదవ్ 52వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. యాదవ సోదరులు, అఖిలేష్ యాదవ్ అభిమానులు, బీసీలు ఎస్సీలు, ఎస్టీలు,మైనారిటీలు యువత పాల్గొని జన్మదిన కేకు కటింగ్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మల్లి బాబు యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కూటమితో కూడిన ఇండియా కూటమిలో రాహుల్ గాంధీ తర్వాత అఖిలేష్ యాదవ్ కి ప్రత్యేక స్థానం ఉన్నదని, యాదవ జాతి భారతదేశ ఆశా కిరణం అఖిలేష్ యాదవ్ తన తండ్రి గారైన సమాజ్ వాది పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి, అఖిల భారత యాదవ మహాసభ నిర్మాణంలో దేశవ్యాప్తంగా, విస్తరింపజేసిన ప్రముఖులు ములాయం సింగ్ యాదవ్ అడుగుజాడల్లో రాజకీయాల్లోకి అడుగుపెట్టి తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారని, 2012లో జరిగిన ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలలో బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీలను కలుపుకొని ఒంటి చేత్తో తన పార్టీని గెలిపించుకొని కేవలం 38 ఏళ్ల వయసులో దేశంలోనే అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్ కు సీఎం గా పదవిని అలంకరించిన వ్యక్తి అఖిలేష్ యాదవ్ అని,ప్రస్తుతం లోక్ సభ ఎంపీగా,సమాజ్ వాది పార్టీ పార్లమెంటరీ అధ్యక్షుడిగా,తన సతీమణి డింపుల్ యాదవ్ కూడా ఎంపీగా కొనసాగుతున్నారని తెలిపారు.ఒకపక్క రాజకీయాల్లో ఉంటూ, యాదవుల ఐక్యత కోసం దేశమంతటా పర్యటిస్తూ, యాదవులను చైతన్యం చేస్తూ పర్యటిస్తున్నారని, భావి భారత ప్రధానిగా నేడు యాదవులు కాంక్షిస్తున్నారని మల్లి బాబు యాదవ్ ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మేకల మల్లికార్జునరావు, బండిపాడు గ్రామ కాంగ్రెస్ నాయకులు గుగులోత్ రవి,షేక్ రబ్బానీ పాషా,శీలం పుల్లయ్య,బండి ఉపేందర్, జక్కంపూడి వెంకటేశ్వర్లు పాటి బండ్ల ప్రసాదు, బాదావత్ నాగరాజు, కిషన్,నరేష్,మేకల లక్ష్మీనారాయణ, దేరంగుల తిరపయ్య, మొగిలి శ్రీను, లకావత్ నాగేష్, బద్రు,గుగులోత్ మదార్, భూక్య నాగేంద్రబాబు.వీర నాగులు.తదితరులు పాల్గొన్నారు.



ఇద్దరు సైబర్ నేరస్తుల అరెస్టు

ఖమ్మం కార్పొరేషన్ జూలై 1 (జనం సాక్షి)

ఆన్లైన్ లో ట్రేడింగ్ మరియు ఇన్వెస్ట్మెంట్ లో డబ్బులు పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించి, సుమారు 94 లక్షల రూపాయలు మోసం చేసిన కేసులో ఇద్దరిని ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు కేరళ లో ని త్రివేంద్రం సిటీ లో అరెస్టు చేసినట్లు ఖమ్మం సి.పి. సునీల్ దత్ గారు తెలిపారు. కేసు వివరాలలోకి వెళితే ఖమ్మం జిల్లాకు చెందిన ఉద్యోగికి Whatsapp లో పరిచయం అయి ఆన్లైన్ లో Dolat Capital investment club కంపెనీ లో ట్రేడింగ్ మరియు ఇన్వెస్ట్మెంట్ చేస్తే అధిక లాభాలు వస్తాయని ఆశచూపి వాట్సప్ మరియు ట్రేడింగ్ లింకులు,అప్లికేషన్ ద్వారా సుమారు 94 లక్షల రూపాయలు ఇన్వెస్ట్మెంట్ చేసి మోసపోయిన కేసులో గాను" 13 లక్షలు " రూపాయిలు అక్కౌంట్ కి వెళ్ళిన అక్కౌంట్ హోల్డర్స్ అయిన ఆశీనా , వయస్సు 35 సం: లు మరియు నిసముద్దీన్ , వయస్సు 42 సం: లు లను , కేరళ లో ని త్రివేంద్రం సిటీ లో అరెస్టు చేసి ఖమ్మం కి ట్రాన్సిట్ వారెంట్ ద్వారా తీసుకొచ్చి ఖమ్మం సైబర్ క్రైం కోర్టులో హాజరు పరిచి, రిమాండ్ కి తరలించినట్లు తెలిపారు. ఈ కేసు విచారణలో ముఖ్య పాత్ర వహించిన సైబర్ క్రైమ్ డి. ఎస్పీ, ఫణిందర్ ని,ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రవి కుమార్ , ఎస్సైలు రణీజిత్ కుమార్ , విజయ్ కుమార్ ,హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు ,కానిస్టేబుల్స్ వెంకట కృష్ణ రావు ,నాగేంద్ర ,కృష్ణ ప్రసాద్,స్వప్న మరియు సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సిబ్బందిని ఖమ్మం సి పి సునీల్ దత్, అభినందించారు.






# పదవులు లేకున్నా ప్రజల మనిషి

### ○ శ్రీనివాస్ రెడ్డికి రూ.50 వేల ఆర్థిక సాయం అందించిన బుసిరెడ్డి పాండురంగారెడ్డి

### ○హైదరాబాద్‌లో పరామర్శించి అండగా ఉంటానని భరోసా

**పెద్దవూర జూలై 1 (జనంసాక్షి)** నాగార్జునసాగర్ నియోజకవర్గం పెద్దవూర మండలం నాయనవానికుంట గ్రామానికి చెందిన కత్తి శ్రీనివాస్ రెడ్డి ప్రస్తుతం అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్, ప్రముఖ సామాజిక కార్యకర్త బుసిరెడ్డి పాండురంగారెడ్డి స్వయంగా ఆసుపత్రికి వెళ్లి శ్రీనివాస్ రెడ్డిని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, తక్షణ సహాయం కింద ××రూ.50,000 (యాభై వేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని అందజేశారు. రాబోయే రోజుల్లో కూడా శ్రీనివాస్ రెడ్డి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటానని, సహాయ సహకారాలు అందిస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.సాగర్ నియోజకవర్గ అభ్యర్థిగా బుసిరెడ్డిని ప్రకటించాలని ప్రజల డిమాండ్ ఎలాంటి రాజకీయ పదవి లేకపోయినప్పటికీ, బుసిరెడ్డి ఫౌండేషన్ ద్వారా నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని ప్రతి పేదవాడికి "నేనున్నాను" అంటూ బుసిరెడ్డి పాండురంగారెడ్డి కొండంత అండగా నిలుస్తున్నారు. నియోజకవర్గంలోని ప్రతి గడపకూ సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్న ఇలాంటి గొప్ప మానవతావాదికి రాబోయే సాధారణ ఎన్నికల్లో ఏ పార్టీ నుంచైనా సరే ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని స్థానిక పేదలు, మధ్యతరగతి ప్రజలు, రైతులు, మరియు వ్యవసాయ కూలీలు గట్టిగా కోరుకుంటున్నారు. పదవి ఉంటే ఆయన మరింత అద్భుతంగా ప్రజాసేవ చేయగలుగుతారని, సాగర్ నియోజకవర్గానికి ఇలాంటి మహోన్నతమైన నాయకుడు దొరకడం ఇక్కడి ప్రజల అదృష్టమని నియోజకవర్గ పౌరులు బుసిరెడ్డి పాండురంగారెడ్డికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.



# ప్రతి ఉద్యోగికి పదవి విరమణ సహజం

**హాలియా జనం సాక్షి జూలై 1** ప్రతి ఉద్యోగికి పదవి విరమణ సహజమని హాలియ వాసవి క్లబ్ అధ్యక్షులు కే సా శేఖర్ అన్నారు . బుధవారం నాడు హాలియా జిల్లా పరిషత్తు ప్రధానోపాధ్యాయుడు గుండా కృష్ణమూర్తి పదవి విరమణ సందర్భంగా. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు పే న్నులు పెన్సిళ్లు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయుడు పదవ తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి ఉన్నత శిఖరాలకు ఎదిగే విధంగా తీర్చిదిద్దాడని ఆయన సేవలను కొనియాడారు. అనంతరం అక్షర కిరణ మానసిక విద్యార్థులకు మెడికల్ కిట్లను అందజేశారు ఈ కార్యక్రమంలో వాసవి. వనితా క్లబ్ సభ్యులు గట్టు రాము. చిట్టిపోలు సురేందర్ గండె మహేష్ . పాంపాటి వెంకటేశం నిర్మలాదేవి. నీలా ఉష. నీలా పద్మ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# కంటైనర్ ఢీకొని యువకుడి దుర్మరణం



**జనంసాక్షి, మిర్యాలగూడ :** కంటైనర్ ఢీ కొని యువకుడు మరణించిన ఘటన వేములపల్లి మండల కేంద్రం లో చోటుచేసుకుంది. మండలం లోని మొల్కపట్నం గ్రామానికి చెందిన పోతన బోయిన వంశీ (21) తన పనుల నిమిత్తం వేములపల్లి బస్టాండ్ వద్దకు వచ్చాడు. అదే సమయంలో అటుగా అతివేగంగా దూసుకొచ్చిన ఒక కంటైనర్, అదుపు తప్పి వంశీ ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదం లో వంశీ తలకు తీవ్రమైన దెబ్బలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు.అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ భూమిపూజ



పేద కుటుంబానికి ఇళ్ల నిర్మాణమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని అనుముల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుందూరు వెంకటరెడ్డి అన్నారు బుధవారం నాడు తెలంగాణ ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకమైన "ఇందిరమ్మ" ఇళ్ల నిర్మాణ పథకానికి శ్రీకారం చుదుతూ హాలియా మునిసిపాలిటీ 9వ వార్డులో ఈ ఉదయం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. నాగార్జునసాగర్ నియోజకవర్గ శాసనసభ్యులు గౌరవ శ్రీ కుందూరు జయవీర్ రెడ్డి గారి సహకారంతో పూజను మండల మరియు మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి గారు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, ఇందిరమ్మ పథకం ద్వారా ఇళ్ల లేని దీర్ఘకాల కష్టపడిన పేద కుటుంబాలకు స్వంత ఇళ్ల కల నిజమవుతోందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా సామాజిక సమత్వం, ఆత్మగౌరవం మరియు జీవిత ప్రమాణాల మెరుగుదలకు తోడ్పడతుందన్నారు. కౌన్సిలర్ చెరుపల్లి ముత్యాలు గారు మాట్లాడుతూ, ఇందిరమ్మ పథకం ఒక సామాజిక సంకల్పం అని, ఇది కేవలం ఏర్పరచడం కాకుండా లబ్ధిదారుల ఆత్మగౌరవాన్ని పునర్నాపించేందుకు, పేదరిక నిర్మూలనలో కీలకంగా మారే కార్యక్రమమన్నారు. ముఖ్యమంత్రి గారు మరియు శాసనసభ్యులు గారికి మన నగరం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.పూజ కార్యక్రమంలో హాలియా మునిసిపల్ చైర్మన్, కౌన్సిలర్లు బొంగరాల యేసు రాజు, దేపావత్ ప్రసాద్ నాయక్, గౌరవ సలహాదారులు చిట్టిపోలు కరుణా సాగర్, నకరికంటి సైదులు, యడవల్లి రంజిత్ తదితరులు పాల్గొన్నారు. పట్టణ పార్టీ నాయకులు వెంపటి శ్రీనివాస్, నెరమటి వెంకటరెడ్డి, సహకార సభ్యులు కొమ్మనబోయిన జయమ్మ, మహమ్మద్ రషీద్, మహమ్మద్ బాబుద్దీన్, పొదిల కృష్ణ, కప్పల సైదులు, వార్డు ఇన్చార్జి ఈశ్వరిపాయ్ మరియు మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లోకి చేరికల జోరు!



- ఆరేకోడు నుంచి అధికార పార్టీలోకి బీఆర్ఎస్, సీపీఎం ముఖ్య నేతలు..
- కండువాలు కప్పి ఆహ్వానించిన మంత్రి పొంగులేటి క్యాంపు ఇన్‌చార్జి దయాకర్ రెడ్డి..

**ఖమ్మం రూరల్, జూలై 1(జనంసాక్షి)**
ఖమ్మం రూరల్ మండల పరిధిలో కాంగ్రెస్ పార్టీలోకి వలసల జోరు కొనసాగుతోంది. బుధవారం ఖమ్మం రూరల్ మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తోట వీరభద్రం ఆధ్వర్యంలో ఆరేకోడు గ్రామానికి చెందిన బీఆర్ఎస్, సీపీఎం పార్టీల ముఖ్య నాయకులు భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. సీపీఎం ముఖ్య నేత పేరెల్లి మధు, బీఆర్ఎస్ ముఖ్య నేత ఎనిగండ్ల రాంబాబు తమ అనుచరులతో కలిసి అధికార పార్టీ బాట పట్టారు.
తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం క్యాంపు కార్యాలయంలో ఈ చేరికల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి ముఖ్య నాయకులకు కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ప్రజా రంజక పాలన, నియోజకవర్గంలో జరుగుతున్న విస్తృత అభివృద్ధి పనులకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి వలసలు పెరుగుతున్నాయని ఈ సందర్భంగా నేతలు పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిలివేరు బాబు, గునిగంటి రమేష్, ఉప్పుగండ్ల ప్రసాద్, గునిగంటి సురేష్, కుసుమ రాజ, అరేంపుల రామారావు, మహిళా నాయకురాళ్లు గన్నోజు గోవిందమ్మ, అరేంపుల సునీత తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీ నాయకుల కృషితో ఎర్రుపాలెం లో శాతవాహన తాత్కాలిక నిలుపుదల

**ఎర్రుపాలెం, జులై 1 (జనంసాక్షి):**
ఎర్రుపాలెం మండలం వాసుల చిరకాలకోరిక శాతవాహన రైలు ఎర్రుపాలెం మండలం లో ఆగటం బిజెపి నాయకులతో కలిసి ప్రయాణికులు మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి,కి ఇటీవల కలిసి వినతి పత్రం సమర్పించిన తరువాత వారు రైల్వే మంత్రి అశ్విని వైస్తనోవ్, కి తెలియజేయటం తో వారు స్పందించి తాత్కాలికంగా రైలు ఆగుటకు ఆదేశించారు.ఎర్రుపాలెం బీజేపీ మండలం అధ్యక్షులు కొమ్మినేని కృష్ణారావు, సీనియర్ నాయకులు నూతక్కి నరసింహారావు, అనుమోలు సురేష్, దేవరకొండ కోటేశ్వరరావు, పుప్పాల చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శులు కత్తి రవి, కృష్ణా రెడ్డి, ఉపాధ్యక్షులు గరికపాటి పురుషోత్తం, రవిరాల అచ్చరావు, కలసాని రాంబాబు, పలువురు మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా డాక్టర్స్ డే

**నూతనకల్ జూలై1(జనంసాక్షి)**
నూతనకల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా వైద్యుల దినోత్సవం నిర్వహించారు. డాక్టర్స్ డే అనేది సమాజానికి వైద్యులు అందిస్తున్న నిస్వార్థ సేవలను వారి త్యాగాలను గుర్తించి వారిని గౌరవించుకునే ఒక ప్రత్యేకమైన రోజు అని లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ నాగం సుధీర్ రెడ్డి అన్నారు బుధవారం మండల కేంద్రంలోని సమీరా నాగుల్ మీరా హాస్పిటల్ ఆవరణలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్స్ డే సెలెబ్రేషన్స్ లో భాగంగా వైద్యాధికారి డా .ఆశ్రీతా రెడ్డి వెటర్నరీ వైద్యాధికారి డా.రాజశేఖర్, డా.పసుపులేటి సోమి రెడ్డి ముగ్గురు డాక్టర్స్ ను ఘనంగా శాలువాలతో సన్మానించారు. వారు మాట్లాడుతూ నిద్రలేని రాత్రులు గడుపుతూ తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఇతరుల ప్రాణాలను కాపాడే నిజమైన సూపర్ హీరోలు డాక్టర్లు అనీ మన ఆరోగ్యాన్ని కాపాడి మన మనసులో చిరునవ్వును నింపే ప్రతి వైద్యునికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం తాము




చేస్తున్న సేవలను గుర్తించి తమను సన్మానించిన లయన్స్ క్లబ్ వారికి సన్మాన గ్రహీతలు ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ లయన్ బయ్య రవీందర్, కోశాధికారి లయన్ మేడిపల్లి శ్రీనివాస్,ఇమ్మీడియేట్ పాస్ట్ ప్రెసిడెంట్ ఎల్పిఐఎఫ్ కో ఆర్డినేటర్ లయన్ బందు కృష్ణయ్య, లయన్ ఏలేటి నారాయణ రెడ్డి, లయన్ షేక్ నాగుల్ మీరా, లయన్ సాబాది వెంకట్ రెడ్డి, లయన్ ధీకొండ వీరన్న, లయన్ షేక్ యాకూబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్స్ డే సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులకు ఘన సన్మానం

- మహాత్మా ప్రెస్ క్లబ్ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో శాలువాలతో సత్కారం
- ఆస్పత్రికి అవసరమైన సహకారం అందిస్తాం: వాసవి క్లబ్ జోన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు, మహాత్మా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు జల్లిపల్లి దేవరాజు.
- వైద్యుల సేవలను కొనియాడిన ప్రముఖులు

**అశ్వారావుపేట, జూలై 1,(జనంసాక్షి):**
జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యులను వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పలువురు పత్రికా విలేకరులు ఘనంగా సన్మానించారు. వైద్యులకు శాలువాలు కప్పి డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి సేవలను అభినందించారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగింది.

**వైద్యుల సేవలకు గుర్తింపుగా సన్మానం**
ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం నిరంతరం అంకితభావంతో సేవలందిస్తున్న వైద్యుల సేవలు అమూల్యమైనవని ప్రముఖులు పేర్కొన్నారు. ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. సమాజ ఆరోగ్య సంరక్షణలో ప్రభుత్వ వైద్యుల పాత్ర అత్యంత కీలకమని కొనియాడుతూ, డాక్టర్స్ డే సందర్భంగా వారిని సన్మానించడం ఆనందంగా ఉందని తెలిపారు.

వాసవి క్లబ్ అండగాఎల్లప్పుడూ ఉంటుంది
వాసవి క్లబ్ జోన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు, మహాత్మా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు జల్లిపల్లి దేవరాజు మాట్లాడుతూ, సమాజ సేవే లక్ష్యంగా వాసవి క్లబ్ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి గానీ, వైద్యులకు గానీ భవిష్యత్తులో ఏ విధమైన అవసరం వచ్చినా వాసవి క్లబ్ తరపున తమ వంతు సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే కార్యక్రమాలకు తమ క్లబ్ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు.

**వైద్య వృత్తి సేవకు ప్రతీక**
వైద్య వృత్తి మానవ సేవకు ప్రతీక అని, ప్రజల ప్రాణాలను కాపాడే బాధ్యతను అత్యంత నిబద్ధతతో నిర్వర్తిస్తున్న ప్రతి వైద్యుడు అభినందనీయుడని ప్రముఖులు పేర్కొన్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా అత్యవసర పరిస్థితుల్లోనూ సేవలందిస్తున్న వైద్యుల అంకితభావాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని కోరారు. డాక్టర్స్ డే వంటి సందర్భాలు వారి సేవలను గుర్తించి కృతజ్ఞతలు తెలియజేసే మంచి అవకాశమని అభిప్రాయపడ్డారు. శాలువాలతో సన్మానించిన అనంతరం వారితో ఆత్మీయంగా మాట్లాడి డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. సమాజానికి వారు అందిస్తున్న సేవలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. తమ సేవలను గుర్తించి సన్మానించిన వాసవి క్లబ్ సభ్యులకు, పత్రికా విలేకరులకు వైద్యులు కృతజ్ఞతలు తెలిపారు.



ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ జోన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు, మహాత్మా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు జల్లిపల్లి దేవరాజు, రాయల పోలయ్య (నమస్తే ఇందూర్), సరిదే రాజశేఖర్ (అక్షరం), గణేష్ (పొలిటికల్ పవర్) చల్లా రాజేష్ (జనం సాక్షి ),పరిటాల రాంబాబు (ప్రజా ప్రతిభ) తో పాటు పలువురు పత్రికా విలేకరులు, ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు డి సి హెచ్ ఎం ఎస్ రవిబాబు , సూపరిండెంట్ డాక్టర్ రాధ రుక్మిణి,ఆర్ఎంవో మౌనిక,గైని కాల్ లిస్ట్ మౌనిక, ఉదయ భాస్కర్ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఆర్షియ, ఆశా పర్వీన్,సుజాత మత్తు డాక్టర్ నర్సింగ్ సిబ్బంది, ఇతర ఆస్పత్రి ఉద్యోగులు పాల్గొన్నారు.

**బచ్చలకూరి రాములు ను సన్మానించిన ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ మందడి ఇజ్రాయిల్**

# పేద రైతు కష్టానికి ఘన గౌరవం



**తిరుమలాయపాలెం జూలై 1 (జనంసాక్షి)**

తిరుమలాయపాలెం మండల కేంద్రం లో ప్రపంచ వ్యవసాయ దినోత్సవం సందర్భంగా తిరుమలాయపాలెం మండల కేంద్రం కు చెందిన నిరుపేద రైతు బచ్చలకూరి రాములు ను ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ మందడి ఇజ్రాయిల్ ఘనంగా సన్మానించారు. చిన్న వయసు నుంచే ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొంటూ బీద కుటుంబంలో జన్మించిన రాములు, వ్యవసాయాన్నే నమ్ముకుని కుటుంబాన్ని పోషిస్తూ గ్రామంలో కష్టపడే రైతుగా మంచి గుర్తింపు పొందారని ఆయన కొనియాడారు. సంపద కంటే శ్రమ గొప్పదని, రైతు కష్టం వల్లే సమాజం నిలబడుతుందని మందడి ఇజ్రాయిల్ పేర్కొన్నారు. జీవితంలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తున్న రాములు వంటి రైతులు యువతకు ఆదర్శంగా నిలుస్తారని అన్నారు. రైతుల శ్రమకు తగిన గౌరవం, గుర్తింపు లభించాల్సిన అవసరం ఉందని, కష్టపడే రైతులను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ సందర్భంగా బచ్చలకూరి రాములు మాట్లాడుతూ, తనలాంటి సాధారణ రైతును గుర్తించి సన్మానించడం ఎంతో ఆనందంగా ఉందని, ఈ గౌరవం తనకు మరింత బాధ్యతను పెంచిందని అన్నారు. నిజాయితీగా శ్రమిస్తే తప్పకుండా గుర్తింపు వస్తుందని యువతకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, ప్రజాసంఘాల నాయకులు, గ్రామస్తులు పాల్గొని రాములను అభినందించారు. ఈ కార్యక్రమం లో ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ మాజీ సర్పంచ్ మందడి ఇజ్రాయిల్ మాజీ సర్పంచ్ మందుల వెంకన్న వల్లోజు వెంకటేశ్వర్లు వల్లపు కోటయ్య ఏలూరి సత్యనారాయణ మందుల ఈదయ్య తదితరులు పాల్గొన్నారు.



## వనజీవి రామయ్య ఆశయం నెరవేరుద్దాం - రామకృష్ణ రెడ్డి

**భద్రాచలం జూలై 01(జనంసాక్షి)**

వనజీవి రామయ్య చూపిన బాటలో నడిచి పచ్చదనం పెంపొందించి వనజీవి రామయ్య ఆశయం నెరవేరుద్దామని గ్రీన్ భద్రాద్రి అధ్యక్షుడు ఆర్. రామకృష్ణారెడ్డి అన్నారు. భద్రాచలంలో బుధవారం పద్మశ్రీ దివంగత వనజీవి రామయ్య జయంతి సందర్భంగా భద్రాచలంలోని అభయాంజనేయ పార్కులో గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. ముందుగా వనజీవి రామయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించిన అనంతరం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా గ్రీన్ భద్రాద్రి అధ్యక్షుడు ఆర్. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ భద్రాచలాన్ని సంపూర్ణ హరిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు గ్రీన్ భద్రాద్రి నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించే బాధ్యతను స్వచ్ఛందంగా తీసుకోవాలని, మొక్కలు నాటడం ఒకరోజు కార్యక్రమం కాదని,. భావితరాల భవిష్యత్తును కాపాడే సామాజిక బాధ్యత మనందరిపై ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. వనజీవి రామయ్య కలలుగన్న పచ్చని భద్రాచలాన్ని సాకారం చేయడమే గ్రీన్ భద్రాద్రి లక్ష్యం' అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వృక్షమిత్ర అవార్డు గ్రహీత డాక్టర్ గొల్ల భూపతిరావు, గ్రీన్ భద్రాద్రి కార్యదర్శి భూక్యా రంజిత్ నాయక్, కోశాధికారి ఉప్పాడ రాంప్రసాద్ రెడ్డి, భద్రాచలం వనజీవి సంపత్ శ్రీరంగం, పార్క్ కృష్ణ, పర్యావరణ ప్రేమికులు, స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొన్నారు.

## సాగుకాలం దాటిపోతుందని ధర్మారెడ్డి పల్లి ఆయకట్టు రైతులలో ఆందోళన



పనులలో నిర్లక్ష్యం ఉందని రైతుల పక్షాన సాగునీటి కోసం సిపిఎం పోరుబాటకు సిద్ధమై ఈనెల 10న నీటిని విడుదల చేయకపోతే 11న మేమే విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది. అయితే అధికారులు మాత్రం ఈనెల రెండో వారంలోపే రైతులకు సాగునీటిని అందించాలనే పట్టుదలతో ఉన్నట్లు తెలుస్తుంది. మొత్తానికి సాగునీటి కోసం అటు సిపిఎం పోరాటం ఇటు ఇరిగేషన్ అధికారుల ఆరాటం మధ్య నీటి విడుదల ఏమయితుందోనని ఉత్కంఠత నెలకొంది.

## అంబేద్కర్ విగ్రహం చుట్టూ కాంగ్రెస్ పార్టీ హంగులు

రాజ్యాంగ విలువలు, మహనీయులను గౌరవించడం ప్రతి పౌరుడి ప్రాథమిక విధిగా పేర్కొనబడింది. మహనీయుల విగ్రహాలను రాజకీయ ప్రచారానికి వినియోగించరాదనే అభిప్రాయాన్ని గతంలో పలు సందర్భాల్లో న్యాయస్థానాలు, ప్రజాసంఘాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో నల్లగొండలో చోటుచేసుకున్న ఈ ఘటన మరోసారి చర్చకు దారితీసింది. విగ్రహం చుట్టూ ఏర్పాటు చేసిన పార్టీ జెండాలు, తోరణాలను వెంటనే తొలగించాలని, మహనీయుల విగ్రహాలను రాజకీయ ప్రచార వేదికలుగా మార్చకుండా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ అభిమాన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. సమస్య పరిష్కారం కాకపోతే జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరిస్తున్నట్లు సమాచారం.

## సర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

**బూర్గంపహాడ్ జూలై 01 (జనంసాక్షి)**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా జరిగే సర్వేలో అర్హత కలిగి ఉన్న ఒక్క ఓటరు ఓటు కూడా జాబితా నుంచి తప్పిపోకుండా చూడాల్సిన బాధ్యత బీఎల్వోలపై ఉందని బూర్గంపహాడ్ డిప్యూటీ తహశీల్దార్ సమ్మయ్య అన్నారు. బుధవారం తహసిల్దార్ కేఆర్ కె ప్రసాద్ ఆదేశాల మేరకు అఖిలపక్ష నాయకులు, బీఎల్ఓలు, బీఎల్ఎలకు తహసిల్దార్ కార్యాలయంలో ప్రత్యేకంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, బీఎల్ఓ, బీఎల్ఎలు సర్ ప్రక్రియలో భాగంగా ఓటరు ఇంటికి వెళ్లిన సమయంలో వారికి ఎన్యుమరేషన్ ఫారాలు అందించి వాటిని అవసరమైతే పూర్తి చేయాలని, దానిపై ప్రత్యేకంగా వారికి అవగాహన కల్పించి దగ్గరుండి తప్పులు లేకుండా ఫారం -నింపేలా చూడాలన్నారు. సర్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించినప్పుడే అర్హత కలిగిన ఓటర్ల జాబితా నుంచి పోకుండా ఉంటాయన్నారు. బీఎల్ఓ, బీఎల్ఎలు ఈ సర్వేను పకడ్బంధీగా నిర్వహించి గడువులోగా పూర్తి చేయాలన్నారు. సదస్సులో బీఎల్ఓ, బీఎల్ఎ, అఖిలపక్ష నాయకులు అడిగిన ప్రశ్నలకు అధికారులు జవాబులు ఇచ్చి వారికి సర్ ప్రక్రియపై మరింత అవగాహన కల్పించారు. కుటుంబంలో ఓటర్ల వివరాలు ఒకే చోట నమోదు చేసే ఫ్యామిలీ మ్యాపింగ్ అత్యంత కీలకమని, 2002 ఓటర్ల జాబితాను ప్రామాణికంగా పరిగణిస్తారని, ఆదార్‌లో ఉన్న వివరాలకు అనుగుణంగానే ఫారం నింపాలని, అవసరమైన డిక్లరేషన్‌పై సంతకం చేయించాలన్నారు. ఎక్కడైనా సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సదస్సులో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు వీర్రాజు, వెంకటేశ్వర్లు, జీపీవోలు పాల్గొన్నారు.



# రైతులు నాణ్యమైన అన్ని రకాల మిర్చి విత్తనాల నారును వేసుకోవాలి

- ○ఉద్యానవన శాఖ వారి ఆధ్వర్యంలో నర్సరీ చట్టం పై రైతులకు నర్సరీ యజమానులకు అవగాహన సదస్సు
- ○ప్రభుత్వ నియమాలని పాటించాలి నర్సరీ యజమానులు
- ○కల్తీ విత్తనాలు వేసి రైతులను మోసం చేస్తే నర్సరీ యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటాం
- ○ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ జిల్లా అధికారి ఎం వి మధుసూదన్
- ○ఉద్యానవన శాఖ వైరా డివిజన్ అధికారి డాక్టర్ ఆకుల వేణు

**కామేపల్లి , జూలై 1 (జనంసాక్షి):**

కామేపల్లి మండల పరిధిలోని ముచ్చర్ల గ్రామంలో నిర్వహించిన నర్సరీ చట్టాల అవగాహన సదస్సులో ఈ సందర్భంగా యం వి మధుసూదన్. ఉద్యానవన అధికారి డాక్టర్ ఆకుల వేణు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంవారి ఆదేశాల మేరకు రైతులకు ఎంతటి వారైనా నర్సరీ యజమానులు మోసం చేసిన శ్రమించేది లేదని వారు అన్నారు రైతులకు నాణ్యమైన విత్తనాలు తో పాటు బిల్లు రసీదు అందించి వారు కోరిన రకాల మిర్చి నారు ఇవ్వాలని రైతులు మోసపోవద్దని ఎవరైనా మోసపోతే తమరి దృష్టికి తీసుకురావాలని వారు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు జాగ్రత్త చర్యగా తీసుకొని రైతులను అవగాహన సదస్సు పెడుతూ చైతన్య పరచాలని.ప్రభుత్వ సూచనల మేరకు కల్తీ మిర్చి రకాల నారుని అరికట్టి ఆరోగ్యకరమైన అన్ని రకాల నారును రైతులకు అందుబాటులో తెచ్చేవిధంగా ఉద్యాన శాఖ ద్వారా నర్సరీ రిజిస్ట్రేషన్ చేయుటకు. నర్సరీ క్రమబద్ధీకరణ 2017 ప్రకారం నియమ నిబంధనలు పాటించాలని జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి యం.వి.మధుసూధన్ పేర్కొన్నారు. మండలంలోని రైతులు నర్సరీ యజమానులకు నర్సరీ చట్టంపై అవగాహన సదస్సులో పాల్గొని, వైరా డివిజన్ మిరప నర్సరీ యజమానులకు పలు సూచనలు చేసినారు.



నర్సరీ చట్టం 2017 ప్రకారం లైసెన్స్ లేకుండా నర్సరీలు నిర్వహించకూడదు.

ప్రభుత్వ ఆమోదం పొందిన కంపెనీల నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. నర్సరీలలో పలు మేలైన యాజమాన్య పద్ధతులు,సూచనలు పాటిస్తూ నర్సరీ చట్టం ప్రకారం నియమ నిబంధనలు పాటించాలి. రైతుల అంగీకారం తెలిపిన రకాలను, పేరు గాంచిన రకాలను,వ్యవసాయ శాఖ ద్వారా ఆమోదం పొందిన రకాల నారు ను పెంచాలి.రైతుకు సంబంధించిన విత్తనాలు,విత్తిన వాటికి సంబంధించిన వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలి. నర్సరీ రిజిస్టర్లు (5 రికార్డులు మెయింటెనెన్స్ చేస్తూ రిజిస్టర్లో పూర్తి వివరాలతో నమోదు చేసి మెయింటెన్ చేయాలి. నర్సరీ లైసెన్స్ నంబరు తో ముద్రించిన బిల్లు మాత్రమే కొనుగోలుదారుకు/ రైతులకు ఇవ్వాలి. నర్సరీ లైసెన్స్ లేకుండా నర్సరీ నుండి మిరప, కూరగాయలు మొదలైన నారు అమ్మవద్దు,కొనవద్దు.

నర్సరీ నియమ నిబంధనలు పాటించని వారి పై నకిలీ విత్తనాలతో నారు పోసిన వారి పై రూ.50,000-/ యాభై వేల రూపాయలు జరిమానా లేదా ఒక ఏడాది జైలు శిక్ష లేదా రెండు కూడా వర్తించి విధించి,నర్సరీ లైసెన్సును శాశ్వతంగా రద్దుపరిచి నర్సరీని మూసివేయబడును. ఈ సదస్సు లో వైరా డివిజన్ ఉద్యాన అధికారి డా.ఆకుల వేణు ఉద్యాన విస్తర్ణ అధికారి సత్యేంద్ర కుమార్,నర్సరీ యజమానులు రైతులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా లంబాడి హక్కుల పోరాట సమితి

# 30వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

### లంబాడీలు రాజ్యాధికార దిశగా అడుగులు వేయాలి

### రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.చుంచుపల్లి మండలం.జనంసాక్షి**

బాణోత్‌చుంచుపల్లి మండలంలోని స్థానిక పోస్టాఫీస్ సెంటర్‌లో జిల్లా కన్వీనర్ మంగీలాల్ నాయక్ ఆధ్వర్యంలో లంబాడి హక్కుల పోరాట సమితి 30వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, న్యాయవాది రమేష్ నాయక్ బాణోత్ మాట్లాడుతూ, వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బెల్లయ్య నాయక్ నాయకత్వంలో గత మూడు దశాబ్దాలుగా గిరిజన హక్కుల సాధన కోసం సమితి నిరంతరం పోరాటం చేస్తోందన్నారు.తండాలకు ప్రత్యేక గ్రామపంచాయతీల ఏర్పాటు, లంబాడీలకు 10 శాతం రిజర్వేషన్ అమలు, గోర్ బోలి భాషను భారత రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చడం వంటి ప్రధాన డిమాండ్ల సాధన కోసం సమితి కృషి చేస్తోందని తెలిపారు. అలాగే ఏజెన్సీ ప్రాంతాల్లోని ఉద్యోగాలను 100 శాతం స్థానిక గిరిజనులతోనే భర్తీ చేయాలని, గిరిజన హక్కుల పరిరక్షణకు సంబంధించిన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.లంబాడీలు రాజకీయంగా, సామాజికంగా మరింత చైతన్యంతో ముందుకు సాగి రాజ్యాధికార సాధన దిశగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ నాయక్, సురేష్ నాయక్, నాగేశ్వరరావు, శ్రీనివాస్ నాయక్, రవి, బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా రామిశెట్టి శెట్టి రోశయ్య

# శతవసంత మహోత్సవం

**మధిర, జూలై 01 (జనంసాక్షి) :**

కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు, రిటైర్డ్ ఉపాధ్యాయులు, ప్రముఖ రచయిత రామ్ శెట్టి రోశయ్య శతవసంత మహోత్సవ కార్యక్రమాన్ని బుధవారం స్థానిక ఎస్సార్ గార్డెన్లో ఘనంగా నిర్వహించారు.

రామిశెట్టి శెట్టిరోశయ్య శతవసంత మహోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,

మాజీ డిసిసిబి అధ్యక్షుడు దొండపాటి వెంకటేశ్వర రావు , రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, కాంగ్రెస్ జిల్లా నాయకులు, మొండితోక సుధాకర్, ప్రముఖ న్యాయవాది దేవరపల్లి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఎర్ర సూరీడు హిందీ పండిట్ శతవసంతంగా విరిసిన రామిశెట్టి రోశయ్య కి పాదాభింద్రం చేసి సన్మానించారు.కలమెత్తి ప్రశ్నించిన శ్రామికుడు

శత వసంతాలు శ్రమించినా ఆగని దోపిడీ భుజాలు కాయలుగా మారినా విరగని కావిడి మన రామిశెట్టి రోశయ్య సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా పతినిధులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల బాధ్యులు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# పెట్టుబడిదారుల దత్తపుత్రుడు మోదీ..

### వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు..



**ఖమ్మం రూరల్, జూలై 1(జనంసాక్షి ):**
వీబీజీ రాంజీ బిల్లును వెంటనే రద్దుచేసి ఉపాధి హామీ పథకానికి ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామిణ ఉపాధి హామీ పథకాన్నే కొనసాగించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.వీబీజీ రాంజీ బిల్లును వ్యతిరేకిస్తూ వ్యకాస,సీఐటీయూ,రైతు సంఘం, కేవీపీఎస్,గిరిజన సంఘం ఆధ్వర్యంలో మండలంలోని ఎం. వెంకటయా పాలెం, ఆరెకోడు,కాచిరాజు గూడెం,ఆరెకోడు తండా,కస్నాతండా, తల్లంపాడు, పొన్నెకల్, అరేంపుల,చింతపల్లి, పల్లెగూడెం, తనగంపాడు, కామంచికల్ గ్రామాల్లో బుధవారం ఆయా గ్రామాల పంచాయతీ కార్యాలయాల వద్ద నిరసన చేపట్టారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతి పత్రాలను ఆయా సంఘాల నాయకులు పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు.ఈ సందర్భంగా పలు సభల్లో యర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ...కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ కార్మికుల పట్ల అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను విమర్శించారు. మోడీ పారిశ్రామికవేత్తలకు, పెట్టుబడిదారులకు కొమ్ముగాస్తూ పేదల నడ్డి విరుస్తున్నదన్నారు.ఉపాధి హామీ చట్టాన్ని పూర్తిగా తొలగిస్తే దేశవ్యాప్తంగా ఉన్న కార్మికులు తిరగపడతారని అందుకే ప్రతి సంవత్సరం కేంద్ర బడ్జెట్ లో నిధులు తగ్గిస్తూ పేరు మార్పు చేశాడని విమర్శించారు.కార్మికులు సంఘాలకు అతీతంగా ఐక్యమై కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వ్యకాస పాలేరు డివిజన కార్యదర్శి నంద్ర ప్రసాద్,జిల్లా సహాయ కార్యదర్శి వడ్లమూడి నాగేశ్వరరావు,ప్రజా సంఘాల నాయకులు పీ.మోహన్ రావు,భూక్య వీరభద్రం,ప్రతాపనేని వెంకటేశ్వర్లు, నందిపాటి మనోహర్,పాపిట్ల సత్యనారాయణ,భూక్య నాగేశ్వరరావు, కారుమంచి గురవయ్య,పొన్నం భాస్కరరావు, గడ్డం రామారావు, మునిగంటి యాదగిరి, యామిని ఉపేందర్,పల్లె శ్రీనివాసరావు, సిలివేరు వెంకన్న,రామయ్య, మల్లెల వీరయ్య, మునగాల లాల్ బాబు,ఎస్కే.యాకూబ్ జానీ, అవిరేణి గురవయ్య,వరగాని మోహన్ రావు, పొన్నం వెంకటరమణ,అద్దంకి యాలాద్రి,కోటి శ్రీనివాసరావు,వేగినాటి విజయ్ కుమార్, అరేంపుల రమాదేవి,మాలోత్ హరి,యండపల్లి వెంకటరామయ్య, ఏపూరి వరకుమార్, వట్టి కోట నరేష్, గుగులోతు కృష్ణ, సిలివేరు సత్యనారాయణ, మార్కం నాగేశ్వరరావు,గుడి బోయిన అరవింద్, సుజాత, ఎస్కే.సైదాబీ, ఎస్కే.చాందినియా,అరేంపుల ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలి : డిఐఇ ఓ రవిబాబు

**కల్లూరు జూలై 1(జనంసాక్షి)**
ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు హాజరు శాతం పెరగాలన్న ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టి వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసినప్పుడే ప్రభుత్వ కళాశాలలు విద్యార్థులతో కళకళలాడతాయని డీఐఈఓ రవిబాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన బాలికల వసతి గృహాన్ని డి ఐ ఈ ఓ సందర్శించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వేముల శేఖర్ కు పలు సూచనలు చేశారు. బాలికలు బాలురకు వేరువేరుగా టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రివ్యూ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధ్యాపకులు ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఎప్పటికప్పుడు వారి చదువు పట్ల వెనుక పడకుండా మెలకువలు చెబుతూ విద్యనందించాలని సూచించారు. వెనకబడిన విద్యార్థు లకు ప్రత్యేక తరగతు లు నిర్వహించి వారిని కూడా ప్రతిభా వంతులుగా తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థులు కళాశాలకు హాజరు కాకపోతే తల్లిదండ్రులతో సత్సంబంధాలు కలిగి విద్యార్థిని విద్యార్థుల సమాచారాన్ని వారి దృష్టికి తీసుకుపోతూ 100 శాతం హాజరు అయ్యేవిధంగా కృషి చేయాలన్నారు. ప్రతి విద్యార్థి పుస్తకాలతో పాటు సామాజిక స్పృహ కలిగి ఉండాలంటే సాహిత్యాన్ని కూడా వారు చదివే విధంగా వారిని ప్రోత్సహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.



# కల్లూరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ముమ్మరంగాపారిశుధ్య నిర్వహణ పనులు

**కల్లూరుజూలై 01(జనంసాక్షి)**
వర్షాలకు అస్తవ్యస్తంగా తయారైన పలు వీధుల్లోని డ్రైనేజీ కాలవల్లో మురుగునీటి నిల్వల తొలగింపు పారిశుధ్య నిర్వహణ పనులకు కల్లూరు మున్సిపాలిటీ చైర్మన్ ధారావత్ మోహన్ నాయక్, కమిషనర్ సాయి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు. పారిశుధ్య కార్మికుల చేత, జెసిబి యంత్రాల సహాయంతో క్రిటికల్ గా మారిన కల్లూరు పట్టణ పరిధిలోని పలు వీధులలో డ్రైనేజీ కాలువలలోని పూడికతీత, పరిసరాల పరిశుభ్రత పనులను చేపట్టారు. రుతుపవనాల ప్రభావంతో ఆకాశం నల్లటి మేఘాలతో కమ్ముకొని ఆకస్మికంగా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లోని పలు వీధుల్లోని డ్రైనేజీ కాలువలలో చెత్తాచెదారం మట్టితో మురుగు నీటితో పూడికలు పేరుకుపోయి పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజల ఆరోగ్య సంరక్షణలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొల్పే దిశగా పరిసరాల పరిశుభ్రత పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలకు ప్రాముఖ్యతనిచ్చి ఆ దిశగా ముమ్మరంగా పనులు చేపడుతున్నట్లు చైర్మన్ మోహన్ కమిషనర్ సాయి కృష్ణారెడ్డి తెలిపారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా కల్లూరు లోని పలు వార్డులలో విస్తృతగా పర్యటించారు. ఈ సందర్భంగాడ్రైనేజీ కాలువలు, అంతర్గత రహదారులు, పరిసరాల పరిశుభ్రత వంటి పనులను పరిశీలించారు. మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది ఆధ్వర్యంలో మురుగునీటి కాలువలలో పేరుకు పోయిన పూడికలు రహదారుల వెంట ఉన్న కంప చెట్లు, పిచ్చి మొక్కలు తొలగించడం, పరిసరాలు పరిశుభ్రం చేయటం వంటి పనులు చేపట్టారు. ఈ సందర్భంగా "పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కల్లూరు పట్టణంలోని జాతీయ రహదారి సమీపానగల మెట్రో వీధిలో గత కొంతకాలంగా డ్రైనేజీ కాలువలు మట్టి రాళ్లతో పూడుకుపోయి ఇండ్లల్లోని వాడుక నీరు వర్షపు నీరు రహదారులపై ప్రవహిస్తున్నాయి. గత నాలుగైదు రోజులుగాఆకస్మికంగా కురుస్తున్న వర్షానికి అబ్దుల్ హబీబ్ నివాస గృహంలోకి వర్షపు నీరు చేరి బయటికి పోయే పరిస్థితి లేక తీవ్రమైన అవస్థలు పడుతున్నాడు. ఈ విషయం పై స్థానిక మున్సిపాలిటీ అధికారులకు చైర్మన్ దృష్టికి సమస్యను తీసుకెళ్లాడు. దీంతో స్పందించిన చైర్మన్ మున్సిపల్ అధికారులు, వీధిలోని పరిసరాలను పరిశీలించి తక్షణమే జెసిపి పారిశుధ్య కార్మికుల చేత మెట్రో వీధిలోని డ్రైనేజీ కాలువలో పేరుకుపోయిన మట్టి, రాళ్లు చెత్తాచెదారం, మురుగునీటి పూడికలను తొలగించి పరిసరాలు పరిశుభ్రం చేయించారు. తొలగించిన బురదమట్టి, రాళ్లు చెత్తాచెదారాన్ని ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డ్ కు తరలించారు. సుదీర్ఘకాలంగా అస్తవ్యస్తంగా ఉండి నానా ఇబ్బందులు పడుతున్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చొరవ చూపిన మున్సిపల్ చైర్మన్ ధారావత్ మోహన్ నాయక్, కమిషనర్ సాయి కృష్ణారెడ్డికి, మున్సిపాలిటీ కౌన్సిలర్లకు పారిశుధ్య సిబ్బందికి అబ్దుల్ హబీబ్ , స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.







# అర్హుల పేర్లు తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

**మధిర, జూలై 01 (జనంసాక్షి):**
మధిర మండలం ఇల్లూరు గ్రామంలోప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎాఐఖీ) ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో అర్హులైన ఓటర్ల పేర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటరు జాబితా నుంచి తొలగిపోకుండా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పత్తెపరుపు సంగయ్య సూచించారు. బుధవారం ఇల్లూరు గ్రామంలో ఃఒంలతో కలిసి ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితాను పరిశీలించారు.ముఖ్యంగా ఓటర్ల పేర్లు తొలగించబడకుండా జాగ్రత్తలు తీసుకుంటూ,అవసరమైన ధ్రువీకరణ ప్రక్రియను పూర్తి చేశారు. గ్రామంలోని స్వాతంత్ర్య సమరయోధురాలు మువ్వా సీతారావమ్మ నివాసంలో కలిసి, ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎాఐఖీ)కు సంబంధించిన ఫారాన్ని అందజేసి, ఓటు హక్కు పరిరక్షణపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సతీష్ , మువ్వా పద్మా బీఎల్ఏ మెట్టెల.ప్రసాద్ పాల్గొన్నారు.

## టేకులపల్లి మోడల్ స్కూల్ లో స్పాట్ అడ్మిషన్లు

**పెనుబల్లి, జులై 1(జనం సాక్షి)**
పెనుబల్లి మండల పరిధిలోని టేకులపల్లి మోడల్ స్కూల్ లో ఈ నెల 2.3.4. న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ టీవీ రూపస్ ఒక ప్రకటనలో తెలిపారు. 6.7.8.9.10 తరగతులు, ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపిసి,సిఇసి లో మిగిలిన సీట్లకు అవకాశం కల్పిస్తామన్నారు, సీట్లు కావలసిన వాళ్లు ఇవాళ. రేపు ఎల్లుండి మోడల్ స్కూల్లో టీసీ ఇచ్చి అడ్మిషన్ పొందాలన్నారు.



# 'చిన్నారులే వైద్యులైన వేళ'

## స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం

**ఖమ్మం, (జనంసాక్షి) :**
వైద్యాన్ని మహా యజ్ఞంగా భావించి తన వద్దకి వచ్చిన ప్రతి ప్రాణాన్ని కంటికి రెప్పలా కాచుకునే ప్రత్యక్ష దైవం వైద్యుడే అని స్మార్ట్ కిడ్జ్ పాఠశాల కరెస్పాండంట్ చింత నిప్పు కృష్ణ చైతన్య అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా స్మార్ట్ కిడ్జ్ చిన్నారులు పలు స్కిట్ లు ప్రదర్శించి, మానవ జీవితంలో వైద్య వృత్తి గొప్పతనాన్ని చాటి చెప్పారు. ఉపాధ్యాయులు చిన్నారులకి వైద్యులు ఎంత విలువైన వారు అనేది వివరించారు. అనంతరం స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలోని పేరెంట్స్ మరియు వైద్య వృత్తి లో రాణిస్తూ,రోగులకు విశేష సేవలు అందిస్తున్న పలువురు వైద్యులకి మెమెంటో లతో సత్కరించటం జరిగింది.

## భద్రాద్రిరామయ్యకు అభిషేకం, నిత్యకల్యాణం

**భద్రాచలం జూలై 01 (జనంసాక్షి)**
భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారికి బుధవారం సందర్భంగా ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత ్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్య హావచనం, కంకణదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు.



# అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్ ...రిమాండ్ కు తరలింపు

**32 లక్షల విలువ చేసే 32 తులాల బంగారు ఆభరణాలు రికవరీ**

**మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన టౌన్ ఏసీపీ రమణమూర్తి, సీసీఎస్ ఏసీపీ సర్వర్**

**ఖమ్మం కార్పొరేషన్, జూలై 1 (జనంసాక్షి)**
గత కొన్ని నెలలుగా రాత్రి పూట తాళం వేసిన ఇళ్ళను లక్ష్యంగా చేసుకొని వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు టౌన్ ఏసీపీ రమణమూర్తి తెలిపారు. మంగళవారం సాయంత్రం నగరంలోని కిన్నెర హోటల్ ఎదురుగా వున్న పెట్రోల్ బంక్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న ఖమ్మం టూ టౌన్, సిసిఎస్ పోలీసులకు అనుమానస్పదంగా కనిపించిన ఆత్కూరు గ్రామం, మధిర మండలం, ఖమ్మం జిల్లా సెంట్రింగ్ వర్కర్ అయిన నిందితుడు కంబం పాటి ఏసోబు ఏ కందుల సురేష్ రెడ్డి, 45సం ను అదుపులోకి తీసుకొని విచారించ ˇగా గత కొంతకాలంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు తెలుగు రాష్టాల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్ళల్లో దొంగతనాలు చేసి, పలుసార్లు జైలు శిక్షలు అనుభవించాడని ,ఇతనిపై గతంలో 22 దొంగతనాల కేసులలో నిందితుడు గా ఉన్నట్లు తెలిపారు. నిందితుడు నుండి 32 లక్షల విలువ చేసే 32 తులాల బంగారు ఆభరణాలు, 40 వేల రూపాయల విలువ చేసే వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకునట్లు తెలిపారు. గత సంవత్సరం నుండి వివిధ పోలీస్ స్టేషన్ ల పరిధిలో చేసిన దొంగతనాల వివరాల ప్రకారం...1) ఖమ్మం 2వ టౌన్-4 2)ఖానాపురం హవేలీ -3 3) వేంసూరు -1,4) వీ యమ్ బంజర -1, 5)చిల్లకల్లు -1, 6)తిరువూరు -1 ల్లో దొంగతనాలు చేసాడని ఏసీపీ తెలిపారు. సమావేశంలో ఇన్స్పెక్టర్లు, కరుణాకర్, బాలకృష్ణ, భానుప్రకాష్, ఎస్సై రమేష్ పాల్గొన్నారు.

# అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లుకు ఘన జన్మదిన వేడుకలు

**చంద్రుగొండ,జూలై 1 (జనంసాక్షి)**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు జన్మదిన వేడుకలను బుధవారం చంద్రుగొండలో బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేస్తూ మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం ఆయనకు కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రేపల్లెవాడ సర్పంచ్ ఇర్పా స్రవంతి, మాజీ వైస్ ఎంపీపీ నరుకుల్ల సత్యనారాయణ, టౌన్ పార్టీ అధ్యక్షుడు, 2వ వార్డు సభ్యుడు సూరా వెంకటేశ్వర్లు, బెండలపాడు వైస్ సర్పంచ్ బానోత్ బాలు, సొసైటీ డైరెక్టర్ రాందాస్, రావికంపాడు మాజీ సర్పంచ్ బానోత్ రణ్యా నాయక్, మండల నాయకులు సంకా కృపాకర్, నరుకుల్ల వాసు, నరుకుల్ల అప్పాజీ, సత్తి నాగేశ్వరరావు, చీదెళ్ల పవన్ కుమార్, గాదె లింగయ్య, అనుమోలు హనుమంతరావు, అబ్బాస్ అలీ, భూపతి శ్రీనివాసరావు,ఓరుగంటి రాములు, వంకాయలపాటి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# నూతన సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

మధిర, జూలై 01 (జనంసాక్షి):
మధిర మండలంలోని రాయపట్నం గ్రామంలో బీసీ కాలనీ అభివృద్ధి కోసం ఎంపీ రఘురాం రెడ్డి సహాయ నిధుల నుండి రూ.5 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో బీసీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారంగ్రామ సర్పంచ్ గోపి శంకుస్థాపన చేశారు. ముప్పసాని వెంకయ్య ఇంటి వద్ద నుంచి వెంకటేశ్వరరావు?అనూషగార్ల ఇంటి వరకు సీసీ రోడ్డు వేయించే పనులు కొనసాగుతుందనిఈ రోడ్డు నిర్మాణంతో కాలనీ ప్రజలకు మెరుగైన రాకపోకల సౌకర్యం కలుగుతుందని సర్పంచ్ తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో బురద సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాభివృద్ధికి సహకరించిన ఎంపీ రఘురాం రెడ్డికి, అలాగే పనులను పర్యవేక్షిస్తున్న గ్రామ సర్పంచ్ గోపికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.



# మధిర గ్రంథాలయాన్ని సందర్శించిన జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఖాదర్ బాబా

**మధిర, జూలై 01 (జనంసాక్షి):**
మధిర పట్టణ గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఖాదర్ బాబా బుధవారం సందర్శించి గ్రంథాలయంలోని పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సభ్యులు, పాఠకులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని వారి నుంచి వినతిపత్రాన్ని స్వీకరించారు.ఈ సంద ర్భంగా గ్రంథాలయానికి తాజా స్టడీ మెటీరియల్, కొత్త పుస్తకాలు, ఉద్యోగ పోటీ పరీక్షల మెటీరియల్, దినపత్రికలు, వారపత్రికలు, మ్యాగజైన్లు, సాధారణ విజ్ఞాన పుస్తకాలు అందుబాటులో ఉంచడంతో పాటు గ్రంథాలయ భవనానికి మరమ్మతు లు, రంగులు వేయించడం, పెరుగుతున్న పాఠకుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నూతన గ్రంథాలయ భవన నిర్మాణం చేపట్టాలని సభ్యులు కోరారు.వినతిపత్రాన్ని స్వీకరించిన జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఖాదర్ బాబా సమస్యలను సానుకూలంగా పరిశీలించి, తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కదృష్టికి తీసుకెళ్లి నూతన గ్రంథాలయ భవన నిర్మాణంతో పాటు గ్రంథాలయ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా మైనార్టీ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఖాదర్ బాబారని శాలువాతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి తమ అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మధిర మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కోనాధని కుమార్, మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి విజయ్ కుమార్, మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు, మున్సిపల్ కౌన్సిలర్ నకిరికంటి రాజేశ్వరి, షేక్ రసీదున్, జిల్లా కాంగ్రెస్ నాయకులు మిర్యాల వెంకటరమణ గుప్తా, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకయ్య బాబు, మోదుగు బాబు, అద్దంకి మంజీరా, సాలిక సురేష్, మోదుగుబాబు, జాకీర్ హుస్సేన్, తోట సాయి మైలవరపు చక్రి, నాగ మురళి, గాలి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.







# నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

### మిర్యాలగూడ నాకా బందీ లో సరియైన పత్రాలు లేని 150 బైక్ ల పై, 40 మంది పై డ్రంక్ & డ్రైవ్ కేసులు





**జనంసాక్షి, మిర్యాలగూడ :**
జిల్లాలో నిబంధనలు ఉల్లంగించి శాంతి భద్రతల కు భంగం కలిగించే వారిపై ఎలాంటి రాజీ ఉండదని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, స్పష్టం చేశారు. మంగళవారం రాత్రి మిర్యాలగూడ పట్టణంలోని ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారులు, రద్దీ ప్రాంతాలు, వాణిజ్య సముదాయాలు, అనుమానాస్పద ప్రాంతాల్లో నాకాబందీ నిర్వహించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నారు.

తనిఖీల్లో ట్రిపుల్ రైడింగ్, మైనర్లు వాహనాలు నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, సైలెన్సర్లలో మార్పులు చేసి అధిక శబ్దం చేయడం, నంబర్ ప్లేట్ లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడపడం, సరైన వాహన పత్రాలు లేకుండా ప్రయాణించడం వంటి ఉల్లంఘనలకు పాల్పడిన దాదాపు 150 వాహనాలపై కేసులు నమోదు చేశారు.

మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 40 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు ప్రారంభించినట్లు ఎస్పీ తెలిపారు. అర్ధరాత్రి వరకు అనవసరంగా రోడ్లపై తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం, బైక్ రేసింగ్‌లు, సైలెన్సర్లు మార్చి అధిక శబ్దాలతో ప్రజలకు ఇబ్బందులు కలిగించడం, గుంపులుగా తిరిగి శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం వంటి చర్యలను ఏమాత్రం సహించబోమన్నారు. అవసరమైతే వాహనాలను సీజ్ చేసి సంబంధిత చట్టాల ప్రకారం మరింత కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

గంజాయి, మట్కా, జూదం, అక్రమ మద్యం విక్రయాలు, రౌడీయిజం, అసాంఘిక కార్యకలాపాలు, ప్రజల ప్రశాంతతకు భంగం కలిగించే ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలనైనా పూర్తిగా అణచివేస్తాం. ఇకపై ఇలాంటి కార్యకలాపాలపై నిరంతరం నాకాబందీలు, ప్రత్యేక తనిఖీలు, కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహిస్తాం అని పేర్కొన్నారు. చట్టాన్ని ఉల్లంఘించే వారికి ఎలాంటి మినహాయింపు ఉండదు అని ఎస్పీ స్పష్టం చేశారు.

పట్టణంలోని దాబాలు, రెస్టారెంట్లు, కేఫ్‌లు, టీ స్టాళ్లు తదితర వ్యాపార సంస్థల నిర్వాహకులు నిర్దేశించిన సమయానికే తమ వ్యాపార సంస్థలను మూసివేయాలని సూచించారు. నిర్ణీత సమయం దాటిన తర్వాత వ్యాపారాలు నిర్వహించడం, అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం కల్పించడం, చట్టవిరుద్ధ సమావేశాలకు సహకరించడం వంటి చర్యలు గుర్తిస్తే యజమానులపైనా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పట్టణంలో అనుమానాస్పద వ్యక్తులు లేదా అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం తెలియజేసి పోలీసు శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ విజ్ఞప్తి చేశారు.

ఈ విస్తృత నాకాబందీ కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ రవి, సీఐలు నాగభూషణ్, సోమనర్సయ్య, పి.ఎన్.డి. ప్రసాద్, ఎస్ఐలు మరియు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని తనిఖీలు నిర్వహించారు.

## పి.ఏ.పల్లి శాలివాహన సంఘం మండల అధ్యక్షుడిగా సిరసువాడ శ్రీనయ్య



పి.ఏ.పల్లి,జూలై 01(జనంసాక్షి )
తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం ఆధ్వర్యంలో నడికూడ జయంతి రావు నాయకత్వంలో తెలంగాణ శాలివాహన కుమ్మరి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఏరుకొండ వెంకటేశ్వర్లు,కుమ్మరి సంఘం రాష్ట్ర నాయకులు మరియు జిల్లా నాయకులు దేవరకొండ డివిజన్ నాయకుల సమక్షంలో పి.ఏ. పల్లి మండలం శాలివాహన సంఘం మండల అధ్యక్షుడిగా శిరసువాడ శ్రీనయ్య,ప్రధాన కార్యదర్శిగా చిట్టి మల్ల శివశంకర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికయినా అధ్యక్షులు మాట్లాడుతూ పి.ఏ.పల్లి మండలంలో శాలివాహన సంఘాన్ని బలోపేతం చేయడానికి తనవంతుగా కృషి చేస్తానని ఆయన అన్నారు.తన ఎన్నికకు సహకరించిన శాలివాహన మండల నాయకులకు,కుల పెద్దలకు మరియు దేవరకొండ కుమ్మరి సంఘం ఇన్చార్జి తోటపల్లి కిరణ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

### రక్షకభట కార్యాలయంలో పర్యటన శాంతిభద్రతలపై

## దిశానిర్దేశం: (ఎస్పీ) అక్షాన్ష్ యాదవ్



**గుండాల జూలై 1**
**(జనం సాక్షి):** యాదాద్రి భువనగిరి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్పీ) గుండాల రక్షకభట కార్యాలయాన్ని సందర్శించి సమగ్రంగా తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ నిర్వహణ, పెండింగ్ కేసులు, మౌలిక వసతులు, శాంతిభద్రతల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. అలాగే ప్రజలకు సత్వర పారదర్శక, నాణ్యమైన పోలీసు సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా వ్యవహరించాలని, మహిళలు, చిన్నారులు, వృద్ధులకు సంబంధించిన కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, నేరాల నియంత్రణకు క్షేత్రస్థాయిలో మరింత అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. ఈసందర్భంగా స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ) శోభన్ బాబు ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది క్రమశిక్షణతో, సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్న తీరును జిల్లా ఎస్పీ అభినందించారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు ఇదే నిబద్ధతతో కొనసాగాలని సూచించారు. ఈకార్యక్రమంలో డీఎస్పీ పి. శ్రీనివాస్ నాయుడు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం. శంకర్, ఎ౩ఐ శోభన్ బాబు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# అంజనేయ స్వామి అనుగ్రహం పొందాలి

### ○ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత ○దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



**చందంపేట జులై 01(జనంసాక్షి)**
ప్రతి ఒక్కరూ అంజనేయ స్వామి అనుగ్రహం పొందాలి అని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. బుధవారం చందంపేట మండలం ఉస్మాన్ కుంట గ్రామంలో నూతన నిర్మించిన అంజనేయ స్వామి ధ్వజ స్తంభం ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ గారు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని అని ఆయన అన్నారు. ఆంజనేయ స్వామి కృపతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ పాలనలో ఆలయాలకు మహర్దశ వచ్చిందని అన్నారు. సనాతన హిందూ ధర్మరక్ష పరిరక్షణ కోసం కేసీఆర్ విశేష కృషి చేశారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధి కోసం, పునర్నిర్మాణం కోసం బీఆర్ఎస్ సర్కారు నిర్విరామంగా కృషి చేసిందని అన్నారు. రాష్ట్రంలోని 4,805 ఆలయాల ధూప, దీప, నైవేధ్యాల కోసం ప్రభుత్వం ప్రతి దేవాలయానికి రూ. 6వేలు చొప్పున గౌరవ వేతనం చెల్లించి ఆదుకున్నదని అన్నారు. దీనిలో రూ. 2వేలు నిత్య పూజల కోసం, రూ. 4 వేలు అర్చకుల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించిందన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత ఆలయాలకు పునర్వైభవం వచ్చిందన్నారు. రాష్ట్రంలోని దేవాలయాలు కేసీఆర్ కృషితో ఎంతో అభివృద్ధి చెందాయని తెలిపారు. యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయ పున:నిర్మాణం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ప్రత్యేక అభివృద్ధి నిధుల ద్వారా ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలను, కామన్ గుడ్ ఫండ్ నిధులతో ఇతర ఆలయాల జీర్ణోద్ధరణ, దేవాలయాల నిర్మాణ పనులను శరవేగంగా కేసీఆర్ సర్కార్ చేపట్టిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధి కోసం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ సర్కార్ విశేష కృషి చేసిందన్నారు. అనంతరం మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ గారిని గ్రామస్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బోయపల్లి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ ముత్యాల సర్వయ్య, కేతవత్ శంకర్ నాయక్,సర్పంచ్ సత్యనారి, రామావత్ మోహన్ కృష్ణ,కేతావత్ రమేష్, లోటావత్ బీమా నాయక్, దాసు భావోజీ, ఉప సర్పంచ్ అను అతిరాం, ఫకీరా నాయక్, కేతావత్ హేము నాయక్, మంగ్య నాయక్,చందర్,లక్క,జబ్బర్, బిచ్చు, మంగతా, భాషా, జైల్ సింగ్, అరుణ్, అనిల్,తదితరులు ఉన్నారు.

## ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవ వేడుకలు



**కొండమల్లేపల్లి, జులై 1 (జనంసాక్షి):**
జాతీయ వైద్యుల దినోత్సవ సందర్భంగా కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని జైరాం హాస్పిటల్ లో డాక్టర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. డాక్టర్స్ డే సందర్భంగా డాక్టర్ భరత్ సింగ్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉషారాణి లను హాస్పిటల్స్ సిబ్బంది ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ భరత్ సింగ్ ఎంబిబిఎస్ ఎండి మాట్లాడుతూ జాతీయ వైద్యుల దినోత్సవం అనేది వైద్య సమాజం మానవాళికి అందిస్తున్న నిరంతర ఆరోగ్య సేవలకు కృతజ్ఞతలు తెలియజేసే ఒక పవిత్రమైన రోజు అని అన్నారు. వైద్య వృత్తి అనేది కేవలం డబ్బు సంపాదించే వ్యాపారం కాదని అది మానవత్వంతో కూడిన ఒక అత్యున్నతమైన సేవా యజ్ఞం అన్నారు. జూలై 1న జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది డాక్టర్లు, మెడికల్ సిబ్బందిల నిరంతర శ్రమను వారి త్యాగాలను మనస్ఫూర్తిగా అభినందిస్తూ సగర్వంగా కృతజ్ఞతలు తెలుపుకుందామన్నారు. పటిష్టమైన వైద్య ఆరోగ్య రంగం ద్వారానే భారతదేశం ఆరోగ్యవంతమైన, శక్తివంతమైన దేశంగా నిలబడటం సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్స్ సిబ్బంది అంజి, హరీష్ శ్రావణి, రజిత, అనిత, ఊర్మిళ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల్లో విద్య పదిలమేనా..?

విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.విద్యార్థులను రవాణా చేస్తున్న కొన్ని స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు సక్రమంగా ఉన్నాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పాత బస్సులను నడిపించడం, సరైన అనుభవం లేని డ్రైవర్లను తక్కువ జీతాలతో నియమించడం వల్ల విద్యార్థుల ప్రాణ భద్రత ప్రశ్నార్థకంగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు. బస్సుల్లో అత్యవసర భద్రతా పరికరాలు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ వంటి సౌకర్యాలు ఉన్నాయా లేదా అన్నది కూడా అధికారులు పరిశీలించడం లేదని ఆరోపిస్తున్నారు.

**తనిఖీలు ఎక్కడ,తల్లిదండ్రుల డిమాండ్:**

విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు మండలంలోని ప్రైవేట్ పాఠశాలల్లో సమగ్ర తనిఖీలు నిర్వహించిన దాఖలాలు కనిపించడం లేదని విద్యార్థి సంఘాలు విమర్శిస్తున్నాయి. ఫీజులు, పుస్తకాల విక్రయం, మౌలిక సదుపాయాలు, బస్సుల ఫిట్‌నెస్, డ్రైవర్ల అర్హతలు వంటి అంశాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.ప్రైవేట్ పాఠశాలల్లో కొనసాగుతున్న అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని, ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థుల భద్రత, నాణ్యమైన విద్య, పారదర్శక ఫీజుల వ్యవస్థ కోసం జిల్లా విద్యాశాఖ అధికారులు వెంటనే రంగంలోకి దిగి ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రైవేట్ పాఠశాలలపై సమగ్ర తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటారా..? లేక యథావిధిగా పరిస్థితి కొనసాగుతుందా..? అనే ప్రశ్నలకు కాలమే సమాధానం చెప్పాల్సి ఉంది.



## ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి

### విబిజి రాంజీ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్

హుజూర్ నగర్ జులై 1 (జనంసాక్షి ):

వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా చేసిన అనంతరం ఎంపీఓ లావణ్య కు మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పల్లె, వెంకటరెడ్డి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పోసన బోయిన, హుస్సేన్ మాట్లాడుతూ జులై 1 నుండి విబిజి రాంజి చట్టాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా పోరాడి వామపక్షాలు మద్దతుతో సాధించుకున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. విబీజి రాంజీ చట్టాన్ని 125 రోజులు పని దినాలను ప్రచారం చేస్తున్నారు కానీ, నిధులు కేటాయింపు బాధ్యత కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుంది.గతంలో 90 శాతం నిధులు కేంద్రం ఇచ్చేది దానిలో 40% కోత పెట్టి 60 శాతం మాత్రమే ఇస్తున్నారని 40% నిధులను రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలని చెప్తున్నారని వ్యవసాయ పనుల సీజన్ లో 60 రోజులు పని బంద్ చేయాలని కొత్త చట్టంలో ఉందని, కనీస వేతనాలు గురించి కొత్త చట్టంలో ఊసేలేదని, ఉదయం సాయంత్రం పని ప్రదేశంలో ఫోటోలు అప్లోడ్ చేయాలని, ఫోటోలు అప్లోడ్ అయితేనే వేతనాలు వస్తాయి లేకపోతే రావని, గ్రామపంచాయతీ ఎంపిక చేసే అవకాశం దీనిలో లేదని కేంద్ర ప్రభుత్వమే ఎప్పుడు ఎవరికి ఎక్కడ పని పెట్టాలి అనేది నిర్ణయిస్తారన మేట్లు, అసిస్టెంట్లు కొత్త చట్టం అమలు అయితేనే కొనసాగే అవకాశం ఉండదని,వారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు తంగెళ్ల గోపరాజు, మదూరి నరసింహచారి కొప్పుల నాగమ్మ, సిద్దెల వెంకటయ్య, షేక్ సైదా, పారుపల్లి శ్రీనివాసరావు, సిఐటియు మండల కన్వీనర్ బండి గోపి, షేక్ నాగుల మీరా, కూలీలు షేక్ రంజాన్, నూర్జహాన్, నాజియా, జమీల, షేక్ జాన్, కరీమా, మైబు , మస్తాన్, బుజామా, లతీఖీ, పి నాగయ్య, సైదులు, తేలూరి కుమార్, తదితరులు పాల్గొన్నారు.



పదవి విరమణ పొందిన హాలియా జిల్లా పరిషత్ ప్రధానఉపాధ్యాయులు గుండా **కృష్ణమూర్తిని బి ఆర్ఎస్ ఏడో వార్డుఇంచార్జి చిట్టిపోలు శ్రీనివాసు హాలియా ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షుడు పట్టణ అధ్యక్షుడు మంచు కొండ ప్రభాకర్. సుభాని కృష్ణమూర్తి దంపతులను ఘనంగా సన్మానించారు.**



### నేడు పి.ఏ.పల్లి,గుడిపల్లి మండలాల్లో దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్ పర్యటన

**పి.ఏ.పల్లి,జూలై 02 (జనంసాక్షి)**

పి.ఏ.పల్లి మరియు గుడిపల్లి మండలాల్లో దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలు నాయక్ పర్యటిస్తున్నట్లు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు నెర్మటి సత్యనారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్ ఓటర్ల సవరణ ఏమ్యూనరేషన్, ప్రోగ్రామ్ గురించి బిఎల్ఓ లు మరియు బిఎల్ఏ లు,ముఖ్య కార్యకర్తలు ఉదయం 10:30 గంటలకు శ్రీ మణికంఠ ఫంక్షన్ హాల్ అంగడిపేట కు హాజరు కావాలని,అదే విధంగా కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, సర్పంచులు,మాజీ ఎంపిటిసిలు,మాజీ సర్పంచులు,వార్డు సభ్యులు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,తప్పకుండ హాజరు కావాలని ఆయన కోరారు.



## ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం

హుజూర్ నగర్ రూరల్, జులై 1 (జనంసాక్షి): సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ మండలంలోని లింగగిరి గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని వైద్య సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ నాయక్ కు వైద్య సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పద్మ మాట్లాడుతూ, “వైద్యో నారాయణో హరిః” అనే సూక్తి కి అనుగుణంగా రోగులను, ఆరోగ్యవంతులుగా చేసి ప్రాణాలను కాపాడే వైద్యుడు భగవంతుని స్వరూపంతో సమానమని అన్నారు. వైద్య వృత్తి ఒక ఉద్యోగం మాత్రమే కాదని, మానవ సేవకు అంకితమైన గొప్ప బాధ్యత అని పేర్కొన్నారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ, వారి ప్రాణాలను కాపాడేందుకు వైద్యులు పగలు,రాత్రి అంకితభావంతో శ్రమిస్తున్నారని కొనియాడారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం సేవలందిస్తున్న వైద్యులందరికీ ఆమె శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ పద్మ, నర్సింగ్ ఆఫీసర్లు మరియమ్మ, యరగాని శివకుమార్, ఫార్మసీ ఆఫీసర్ సంతోషి, ఆరోగ్య కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కరెంటు లేక తీవ్ర అవస్థలుపడ్డ ప్రజలు, మీ సేవ,ఇంటర్నెట్ నిర్వహకులు

### జియో సిగ్నల్స్ రాకపోవడంతో ఇబ్బంది పడ్డ వినియోగదారులు

**పి.ఏ.పల్లి,జూలై 01(జనంసాక్షి)**

పి.ఏ.పల్లి మండలంలో కరెంటు లేకపోవడంతో రైతులు,మీ సేవ,ఇంటర్నెట్ నిర్వాహకులు తీవ్ర అవస్థలు పడ్డారు.వివిధ పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలు,మీ సేవ,ఇంటర్నెట్ సేవ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు కరెంటు లేక సిగ్నల్స్ రాకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగి పోయాయి.జియో సిగ్నల్స్ రాకపోవడంతో జియో కస్టమర్స్ తీవ్ర ఇబ్బంది పడ్డారు.కరెంటు లేకపోవడంతో వ్యవసాయ పనులు నిమిత్తం ఆగిపోయాయి.కరెంటు ఉదయం 9 గంటలకు తీసిన విద్యుత్ అధికారులు 3.30 గంటలు అయినా కూడా సరఫరా కాకపోవడంతో కొంత అసహనానికి గురయ్యారు.వివిధ సెల్ ఫోన్ కంపెనీ సిగ్నల్స్ రాక,వినియోగదారులకు జనరేటర్ సౌకర్యం కల్పించక పోవడంతో సిగ్నల్స్ రాక అసౌకర్యంనకు లోనయ్యారు.జియో కంపెనీ నిర్వహకులు జనరేటర్ రిపేర్ ఉన్న బాగు చేయకపోడంతో కస్టమర్స్ చాలా ఇబ్బంది పడ్డారు.నెల నుండి సంవత్సరం వరకు రీఛార్జ్ చేసుకునే జియో వినియోగదారులు కొంత అసంతృప్తి వ్యక్తం చేశారు.ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు రైతులకు పనులు ఉన్న కాలంలో కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని,అదే విధంగా జియో కంపెనీ,వివిధ సెల్ ఫోన్ కంపెనీలు,సిగ్నల్స్ నిర్వహకులు నిరంతరం సెల్ ఫోన్,ఇంటర్నెట్ సిగ్నల్స్ సరఫరా అయ్యే విధంగా చూడాలని వినియోగదారులు కోరుతున్నారు.



## పదవీ విరమణ అనేది సేవకు ముగింపు కాదు

**సూర్యాపేట (జనంసాక్షి):**

పదవీ విరమణ విశ్రాంతి కాదని, మరో కొత్త ప్రయాణానికి ఆరంభం అని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు.బుధవారం పట్టణంలోని మన్నెం సదాశివరెడ్డి ఫంక్షన్ హాల్ లో పంచాయతీ రాజ్ శాఖ డీఈఈ దడిపల్లి మనోహర్ పదవి విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్వోత్తమ్ రెడ్డి పదవి విరమణ పొందుతున్న డిఈఈ మనోహర్ ను ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ సేవలో ఆయన నిబద్ధతతో, నిజాయితీతో ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.ప్రజాసేవలో 35 సంవత్సరాలుగా అంకితభావంతో పనిచేసిన దడిపల్లి మనోహర్ ఆదర్శంగా నిలుస్తారని అన్నారు. పదవీ విరమణ అనేది సేవకు ముగింపు కాదని, కొత్త జీవితానికి ఆరంభమని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ఆయురారోగ్యాలు, ఆనందం, సుఖసంతోషాలతో కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంతమైన జీవితం గడపాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, మున్సిపల్ కౌన్సిలర్లు చిలుముల సునీల్ రెడ్డి, సంద్రపాటి విజయ్ కుమార్, శ్రీ దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, జిల్లా సేవాదల్ అధ్యక్షుడు ఆలేటి మాణిక్యం, పట్టణ ఐఎన్టియుసి అధ్యక్షుడు వల్దాసు శ్రీను, పట్టణ కాంగ్రెస్ ఎస్సి సెల్ అధ్యక్షుడు పిడమర్తి నాగరాజు, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎడ్ల వీరమల్లు యాదవ్, నాగు నాయక్, పడిదల రవి, చెంచల నిఖిల్, అబ్బాస్, శ్రీహర్ష చౌదరి, ఎస్ఈ శ్రీనివాసరావు, ఈఈలు వెంకటయ్య, వెంకటేశ్వరరావు, మాధవి, సత్యనారాయణ, అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### జనగణనలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులకు, వేతనాలు చెల్లించాలి

**నేరేడుచర్ల జూలై 01(జనంసాక్షి )**



వేసవి సెలవుల్లో జనగణన కార్యక్రమంలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, అలాగే ఎన్యుమరేషన్ విధులు నిర్వహించిన ఉపాధ్యాయినులకు, రెమ్యూనరేషన్ చెల్లించి, డ్యూటీ సర్టిఫికెట్లు వెంటనే మంజూరు చేయాలని కోరుతూ టీఎస్ యుటిఎఫ్ నేరేడుచర్ల మండల శాఖ ఆధ్వర్యంలో నేరేడుచర్ల మున్సిపల్ కమిషనర్, మండల తహసీల్దార్ లకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా జనగణన విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయులకు ప్రభుత్వం ప్రకటించిన పారితోషికం, డ్యూటీ సర్టిఫికెట్లు ఎలాంటి జాప్యం లేకుండా అందజేయాలని సంఘం ప్రతినిధులు అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు ఆర్. శ్రీనయ్య, సీనియర్ నాయకులు ఎన్. నరసింహారావు, కె. వెంకటేశ్వరరావు, నేరేడుచర్ల మండల ఎఫ్ డబ్ల్యూఎఫ్ కన్వీనర్ ఎన్. వెంకటేశ్వర్లు, ఎం. యాదగిరి,ఎం.జానకిరాములు,మండల శాఖ ప్రధాన కార్యదర్శి బి.అక్కయ్య బాబు తదితరులు పాల్గొన్నారు.

## వీబీజీ-రామ్‌జీ విధానాన్ని రద్దు చేసి - ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలి

### రామన్నపేట మండల వ్యాప్తంగా నిరసనలు



రామన్నపేట, జూలై 1 (జనంసాక్షి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే లక్ష్యంతో తీసుకొచ్చిన వీబీజీ-రామ్‌జీ విధానాన్ని వెంటనే రద్దు చేసి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ, రైతు సంఘాల ఆధ్వర్యంలో బుధవారం రామన్నపేట మండల వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ కార్యక్రమాలు మండల కేంద్రంతో పాటు మునిపంపుల, కొమ్మాయిగూడెం, వెల్లంకి, ఇస్కిళ్ళ, నేర్నేముల గ్రామాల్లో జరిగాయి. స్థానిక శుభాష్ సెంటర్ లో జరిగిన నిరసనలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జల్లెల పెంటయ్య, సీపీఎం మండల కార్యదర్శి, మునిపంపుల సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం మాట్లాడుతూ దేశంలోని కోట్లాది గ్రామీణ పేదలు, వ్యవసాయ కార్మికులు, నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్న ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా చర్యలు చేపడుతోందని విమర్శించారు.

వీబీజీ-రామ్‌జీ విధానం అమలుతో ఉపాధి హామీ పనుల్లో కార్మికులకు అనేక ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని, పనిదినాలు తగ్గిపోవడంతో పాటు వేతనాల చెల్లింపుల్లో జాప్యం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. గ్రామీణ పేదల జీవనోపాధికి ఆధారంగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే ఎలాంటి చర్యలనైనా ప్రజలు, కార్మిక సంఘాలు కలిసి ప్రతిఘటిస్తాయని హెచ్చరించారు.

కేంద్ర ప్రభుత్వం వెంటనే వీబీజీ-రామ్‌జీ విధానాన్ని ఉపసంహరించుకొని,ఉపాధి హామీ చట్టాన్ని బలోపేతం చేయాలని, పనిదినాలను పెంచి, కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమాల్లో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వనం ఉపేందర్,మండల కార్యదర్శివర్గ సభ్యులు కందుల హనుమంతు,జంపాల అండాలు,మండల కమిటీ సభ్యులు గన్నేబోయిన విజయభాస్కర్,గొరిగే సోములు, నాగటి ఉపేందర్, బావండ్లపల్లి బాలరాజు,ఆవనగంటి నగేష్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు గంటేపాక శివ కుమార్,నీల అయిలయ్య,మేడబోయిన శ్రీనివాస్,మునికుంట్ల లెనిన్, శానగొండ వెంకటేశ్వర్లు,తాళ్లపల్లి జితేందర్, నాగటి ఉపేందర్, శానాగొండ రాము, ఆవనగంటి స్వామి, పాలెం అంజయ్య, జోగుల ధనలక్ష్మి, గుణగంటి మల్లేశం, బాణాల నవీన్ రెడ్డి, ఆకిటి శ్రీను, జల్లెల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## కోదాడ వాసికి వైద్య శిరోమణి 2026 అవార్డు..



కోదాడ,( జనం సాక్షి): జాతీయ వైద్యుల దినోత్సవ సందర్భంగా మెగాసిటీ, నవకళా వేదిక, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు భాస్కర ఆడిటోరియం, బియం బిర్లా సైన్స్ సెంటర్ నందు మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాసనమండలి ప్రతిపక్ష నాయకులు సిరికొండ మధుసూదనాచారి, దైవజ్ఞ శర్మలు పాల్గొని వైద్య వృత్తిలో పనిచేస్తున్న 37 మంది డాక్టర్లకు వైద్య శిరోమణి అవార్డు అందజేసి ఘనంగా సన్మానించారు. అవార్డు పొందిన వారిలో కోదాడ ప్రాంతానికి చెందిన హోమియో వైద్యురాలు డా: సేకు నాగ సంయుక్తరాణి వైద్య శిరోమణి అవార్డు అందుకున్నారు. అవార్డు పొందిన సందర్భంగా కుటుంబ సభ్యులు మరియు పలువురు వైద్యులు అభినందించారు.

## అక్క-అన్న ఏఐ & డిజిటల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ప్రారంభం..



నల్గొండ, జూలై 1,(జనం సాక్షి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అక్క?అన్న ఏఐ ఉ డిజిటల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ బుధవారం నల్గొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ప్రారంభమైంది. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. శ్రీనివాసరాజు ఆదేశాల మేరకు నోడల్ అధికారులు వై.వి. రామారావు, డాక్టర్ ఎ. దయానంద్, డాక్టర్ జి. అమరావతి, డాక్టర్ ఎ. వసంత, డాక్టర్ వై. సునీతలు విద్యార్థినులను నల్గొండలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు తీసుకెళ్లి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి కళాశాల విద్యార్థినికి 10 మంది పాఠశాల విద్యార్థులను కేటాయించి ఏఐ డిజిటల్ నైపుణ్యాలు, మెంటర్‌షిప్‌పై శిక్షణ అందించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు భవిష్యత్ ఉద్యోగ అవకాశాలకు దోహదపడుతుందని ప్రిన్సిపల్ తెలిపారు.

## ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలి

సూర్యాపేట (జనంసాక్షి): ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని సీపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం సీపిఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెండాలు మారినా అజెండాలు మాత్రం మారడం లేదని, ప్రభుత్వాలు మారినా ప్రజల బతుకుల్లో మార్పు రావడం లేదని అన్నారు. కేవలం అధికారం చేపట్టడమే లక్ష్యంగా ఇస్తున్న వాగ్దానాలను విస్మరిస్తున్నారని అన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ను అమలు చేయాలని కోరారు. ఆరు గ్యారెంటీలలో ఒక్క ఫ్రీ బస్సు మినహా మిగతా ఏ పథకం సరిగా అమలు కావడం లేదన్నారు. రైతు భరోసా పూర్తిస్థాయిలో రైతులకు అందడం లేదన్నారు. పెన్షన్లు రెట్టింపు చేస్తామన్న వాగ్దానం కూడా అమలు కాలేదని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలు ఇచ్చి వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న విబిజి రాంజీ చట్టాన్ని ఎత్తివేసి గతంలో మాదిరి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని అన్నారు. యూరియా యాప్ వల్ల రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణమే యూరియా యాప్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ధూళిపాళ ధనుంజయ నాయుడు, ఉస్తేల సృజన మేకల శ్రీనివాస్, కంబాల శ్రీనివాస్, బద్దం కృష్ణా రెడ్డి ,పోకల వెంకటేశ్వర్లు, బూర వెంకటేశ్వర్లు,బత్తినేని హనుమంత రావు, కొప్పోజు సూర్యనారాయణ, దేవరం మల్లీశ్వరి, రెమిడాల రాజు, అనంతుల మల్లీశ్వరి, కడియాల అప్పయ్య ఖమ్మంపాటి రాము, గుగులోతు రాజారాం, చామల అశోక్ కుమార్ ,చిలకరాజు శ్రీను, జడ శ్రీనివాస్, రేగట్టె లింగయ్య, ఎడెల్లి శ్రీకాంత్, బూర సైదులు, పెండ్ర కృష్ణ, ఐలాపురం లక్ష్మి, పొదిలి వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వానివి పేద పాఠశాలలు కాదు.. ఉత్తమ విద్యాసంస్థలు

### జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె. ప్రమీల



సంస్థాన్ నారాయణపురం. జూలై 1. (జనంసాక్షి ): ప్రభుత్వానివి పేద పాఠశాలలు కావని ఉత్తమ విద్యాసంస్థలని జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె. ప్రమీల తెలిపారు. సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక, జనగాం జడ్పీ, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం నిర్వహించిన సమావేశాల్లో ఆమె ప్రసంగించారు. హైదరాబాదుకు చెందిన రిలయబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆ పాఠశాలలకు చెందిన 600 మంది విద్యార్థులకు సమకూర్చిన "స్టూడెంట్స్ కిట్" లను జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం బిక్షపతి తో కలిసి విద్యార్థులకు ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీల మాట్లాడుతూ, తాను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదివానని, తాను ఈ స్థానంలో ఉండడానికి అప్పట్లో తనకు పాఠాలు బోధించిన ప్రభుత్వ ఉపాధ్యాయుల గొప్పతనం అని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉన్నత విద్యార్హతలు అనుభవం ఉన్న ఉపాధ్యాయులు ఉంటారని తెలిపారు. విద్యార్థులు లక్ష్యంపై గురి పెట్టి పట్టుదలతో విద్యాభ్యాసం చేసి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ హాస్టల్లో ఉంటూ నవోదయ విద్యాలయంలో చదివిన తుపాకుల రవి, అతని మిత్రులు కలిసి రిలయబుల్ ట్రస్టును స్థాపించి వేల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సహాయం అందిస్తున్నందుకు ఆయనను అభినందించారు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాల వృక్షం లాంటిది: డీఈవో బిక్షపతి ప్రభుత్వ పాఠశాల వృక్షం లాంటిదని ఎంతోమందికి ఆవాసం కల్పిస్తుందని జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం బిక్షపతి తెలిపారు. ప్రైవేటుపై మోజుతో పిల్లలను అటువైపు పంపితే ప్రభుత్వ పాఠశాలలు మూతబడతాయని నిరుద్యోగులకు ఉపాధి లభించదని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటు న్నామని చెప్పారు మూతబడిన పాఠశాలలను తెరిపించామన్నారు సెప్టెంబర్ నుంచి అన్ని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్టు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రణాళికా ప్రకారం కృషి చేయనున్నట్టు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవడం ప్రజల బాధ్యత అన్నారు. సంస్థాన్ నారాయణపురం మండలంలోని అన్ని జడ్పీ ఉన్నత పాఠశాలల కు చెందిన 1139 మంది విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్స్, పాఠశాలలకు స్పోర్ట్స్ కిట్స్ ఉచితంగా అందజేసిన రిలయబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ తుపాకుల రవిని అభినందించి సన్మానించారు.

సేవ కోసమే రిలయబుల్ ట్రస్ట్ : తుపాకుల రవి, మేనేజింగ్ ట్రస్టీ

ప్రభుత్వ హాస్టల్లో ఉంటూ నవోదయ విద్యాలయంలో చదువుకున్న తాను తన మిత్రులను కలిసి రిలయబుల్ ట్రస్టును స్థాపించామని, ఏళ్లుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అనాథ బాలలకు సేవలందిస్తున్నామని రిలయబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ తుపాకుల రవి తెలిపారు. కరోనా సమయంలో వేల మందికి ఆహార పొట్లాలు, ఔషధాలు పంపిణీ చేశామని, కండర క్షీణత బాధితులకు కుష్టు రోగులకు వృద్ధాశ్రమాలకు నిత్యావసర సరుకులు అందజేస్తున్నామని తెలిపారు. ఈ సహాయాన్ని సద్వినియోగం చేసుకుని మరొకరికి సేవ చేసేంత ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాలకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు హనుమంతు, కే. ఉదయ అధ్యక్షత వహించారు. ఎంఈఓ జి శ్రీనివాస్, సర్పంచులు గజం అనిత, లోడే రఘు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రమాదేవి, ప్రధానోపాధ్యాయులు రఘుమారెడ్డి, అశోక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్య ప్రాముఖ్యతను తెలిపే సాంస్కృతిక కార్యక్రమాలను విద్యార్థులు ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

## ప్రజల ఆరోగ్య పరిరక్షణ కే ఉచిత మెడికల్ క్యాంపులు: నూకల వేణుగోపాల్ రెడ్డి



**జనంసాక్షి,మిర్యాలగూడ:**
ప్రజల ఆరోగ్య పరిరక్షణ కే ఉచిత మెడికల్ క్యాంపు ల నిర్వహణ అని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి అన్నారు. బుధవారం నాడు డాక్టర్స్ డే సందర్భంగా పట్టణం లోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ మరియు జనయేత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ముఖ్య అతిథి గా హాజరయ్యారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో ప్రముఖ వైద్యులు డా. జాడి రాజు, డా. నాగేశ్వరరావు, డా. బాలాజీ, డా. విశాల్, డా. నాగు నాయక్, డా. మోయిద్, డా. ఝాన్సీ లక్ష్మీబాయి, డా. అక్షిత, డా. శ్వేతారెడ్డి, డా. మణికంఠ, డా. రాంబాబులు పాల్గొని ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఎఓం) కు చెందిన ప్రముఖ వైద్యులు డా. మువ్వ రామారావు, డా. అంజయ్య, డా. అశ్విన్ కుమార్, డా. కృష్ణ ప్రసాద్,డా. జానకి రాములు వైద్య శిబిరంలో పాల్గొని వైద్య సలహాలు, ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, ఇటువంటి సేవా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి రిటైర్డ్ పి ఈ టి కామిశెట్టి సత్యనారాయణ ఆర్థిక సహాయం అందిచడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో జనయేత్రి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డా. మునీర్ షరీఫ్, ఉఏఅ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కన్నబోయిన వెంకటేశ్వర్లు యాదవ్, ప్రధాన కార్యదర్శి కొర్ర కృష్ణకాంత్ నాయక్, ఉపాధ్యక్షులు జానకిరామ్ రెడ్డి, వెంకటరత్నం, కోశాధికారి చిన వెంకన్న, సంయుక్త కార్యదర్శులు పులి శ్రీనివాస్ గౌడ్, నామ రత్నకుమార్, డైరెక్టర్లు కాసుల సత్యం, మహేష్ రెడ్డి, సక్రం నాయక్, వంకాయల శ్రీనివాస్, పొదిల శ్రీనివాస్, రాధి రాజేశ్వరి, అశోక్ చారి, నాగరాజు, సైదులు, వీరేందర్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్

**జిల్లా అబ్జర్వర్ గా బయ్య దేవేందర్ యాదవ్**



**సూర్యాపేట(జనంసాక్షి):**
జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం అబ్జర్వర్ గా పీసీసీ ఓబిసి విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ బయ్య దేవేందర్ యాదవ్ మంగళవారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనను నియమించిన టీపీసీసీ ఓబీసీ డిపార్ట్మెంట్ చైర్మన్,షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, టీపీసీసీ ఓబీసీ కన్వీనర్ డాక్టర్ కేతూరి వెంకటేశ్వర్లు, టీపీసీసీ ఓబీసీ కన్వీనర్ జూలరి ధనలక్ష్మికి, సహకరించిన రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్లకు కృతజ్ఞతలు తెలిపారు. బీసీల సమస్యల పరిష్కారంతోపాటు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

# ఘనంగా నేషనల్ డాక్టర్స్ డే వేడుకలు

**వైద్యులను, సీఏలను ఘనంగా సన్మానించిన ఆర్యవైశ్య సంఘం నాయకులు**



**సూర్యాపేట(జనంసాక్షి):**
జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా సూర్యాపేట పట్టణంలోని మమత హోటల్ నందు ఆర్యవైశ్య సంఘ పట్టణ అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులు ఆధ్వర్యంలో నేషనల్ డాక్టర్స్ డే,చార్టర్డ్ అకౌంటెంట్ డే సందర్భంగా పట్టణంలోని ప్రముఖ వైద్యులను, చార్టెడ్ అకౌంటెంట్లను ఘనంగా సన్మానించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వెంపటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఆర్యవైశ్యుల కుటుంబాలలో ఎవరికైనా ఏదైనా ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు డాక్టర్లు తక్కువ ఫీజులు తీసుకునే విధంగా డాక్టర్లతో మాట్లాడుతున్నామని అన్నారు. ఆర్యవైశ్య కుటుంబ హెల్త్ కార్డు స్కీమ్ త్వరలోనే ప్రవేశపెడతామని తెలిపారు. ఇందుకుగాను వైద్యులతో మాట్లాడుతున్నట్లు చెప్పారు. ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులు మాట్లాడుతూ తాను పట్టణ అధ్యక్షులు అయిన తర్వాత మొదటిసారిగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో వైద్యులకు సన్మానం చేయడం సంతోషంగా ఉందని అన్నారు. పట్టణంలోని వైద్యులతో మాట్లాడి పేద ఆర్యవైశ్యులకు తక్కువ ఖర్చుతో వైద్యం లభించే విధంగా తగిన చర్యలు చేపడతామని అన్నారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు సామాజిక సేవకులని, వారు అన్ని కార్యక్రమాల్లో ముందు ఉంటారని అన్నారు. తన హాస్పటల్ నందు పేదలకు తాను తక్కువ ఖర్చుతోనే వైద్యం చేస్తున్నానని, పేద ఆర్యవైశ్యులు వస్తే వారికి కూడా తక్కువ ఖర్చుతో వైద్యం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్, డాక్టర్ మీలా సందీప్, డాక్టర్ తోట కిరణ్, డాక్టర్ విజయ మోహన్ ,డాక్టర్ బిక్కుమల్ల రాజేష్, డాక్టర్ బండారు సుమ,డాక్టర్ భరత్, సీఏ చైతన్యను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం క్రమశిక్షణ సంఘం చైర్మన్ బండారు రాజా, జిల్లా కోశాధికారి చల్లా లక్ష్మీకాంత్, ఆర్యవైశ్య సంఘం నాయకులు బిక్కుమళ్ల కృష్ణ,ఉప్పల శ్రవణ్ కుమార్, రాచకొండ శ్రీనివాస్, నూనె సత్యనారాయణ ,మొరిశెట్టి కోటేశ్వరరావు, మిట్టపల్లి రమేష్, దోగుపర్తి ప్రవీణ్, కుంచపర్తి రాజశేఖర్, గుండా వెంకన్న, కక్కిరేణి ప్రసాద్ చల్లా సత్యనారాయణ, కందిబండ ఉమామహేశ్వరరావు, బెలిదె అంజయ్య, తోట లక్ష్మీనరసయ్య, తల్లాడ మోహన్ తదితరులు పాల్గొన్నారు.



## చండూరులో పాఠశాలలపై కమిషనర్ ఆకస్మిక తనిఖీ

**మధ్యాహ్న భోజన నాణ్యత,పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి**

**చండూరు, జూలై 1 (జనంసాక్షి)**
చండూరు మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్), కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లను మున్సిపల్ కమిషనర్ ఎల్. మల్లేశం బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం, వంటశాల, భోజనశాలల పరిశుభ్రతను నిశితంగా పరిశీలించారు. మధ్యాహ్న భోజనం రుచి, నాణ్యతపై విద్యార్థులతో స్వయంగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం కేజీబీవీలో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించి, వాటిని ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. పాఠశాల ఆవరణలో వర్షపు నీటి సంరక్షణ (రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్) వ్యవస్థను ఏర్పాటు చేయాలని, తడి?పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి నిర్వహించాలని కమిషనర్ ఆదేశించారు. తడి చెత్తతో కంపోస్ట్ తయారు చేసి పాఠశాల ఆవరణలోని మొక్కలకు ఎరువుగా వినియోగించాలని సూచించారు. పాఠశాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థుల్లో పారిశుద్ధ్యంపై అవగాహన పెంపొందించే చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ తనిఖీ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జి. రాములు, సీనియర్ అసిస్టెంట్ ఎ. సాయిభారద్వాజ్, వార్డ్ ఆఫీసర్ బి. సాయిరాం, పర్యావరణ ఇంజనీర్ ఎం. అరవింద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

- బెస్ట్ సేవా సొసైటీ వ్యవస్థాపకులు బుక్కా ఈశ్వరయ్య
- పిల్లలను విధిగా పాఠశాలలకు పంపించాలి
- బడి అభివృద్ధి కోసం దాతలు ముందుకు రావాలి



**రామన్నపేట, జూలై 1 (జనంసాక్షి):**
విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు చేకూరుతుందని బెస్ట్ సేవా సొసైటీ వ్యవస్థాపకులు బుక్కా ఈశ్వరయ్య అన్నారు. బుధవారం రామన్నపేట మండలంలోని కక్కిరేణి హై స్కూల్, ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు డైరీలు, భోజనం ప్లేట్స్, స్టేషనరీ తదితర సామాగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల ప్రదానోపాధ్యాయులు సి.యచ్ రాజన్ బాబు మాట్లాడుతూ.. స్వంత ఊరి మనకారం తో , బెస్ట్ సేవా సోసైటి వ్యవస్థాపకులు బుక్కా ఈశ్వరయ్య హైస్కూల్, ప్రైమరిస్కూల్ విద్యార్థులకు ప్రతి సంవత్సరం సహాయ సహకారాలు అందించడం గర్వించదగ్గ విషయమని అన్నారు. వీరి సేవలను గుర్తించి ప్రభుత్వం నుండి గొల్డ్ మెడల్ పొందిన ఈశ్వరయ్య సేవలు మరువలేనివని కొనియాడారు. దాతలసహకారాలతోనే గ్రామాలలోలోని ప్రభుత్వ పాఠశాలలు కార్పోరేట్ స్కూల్స్ కు దీటుగా అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. ఇలాగే దాతలు ముందు కొచ్చి సహకరిస్తే ఉతీర్ణత శాతం మెరుగు పడుతదని కోనియాడారు. బెస్ట్ సేవా సొసైటీ ఫౌండర్ బుక్కా ఈశ్వరయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు రాజకుయాల జోలికి పోకుండా శ్రద్దగా చదువుకోవాలని, సర్కార్ బడుల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చాల ఖర్చు చేసి పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫాం, బోజన వసతి కల్పిస్తుందని, దానికి తోడు సేవా సంస్థలు సహకరాలు పొందాలని కోరారు. ప్రాదమిక పాఠశాల ప్రదానోపాద్యాయులు బి .ఉపేందర్ జీ మాట్లాడుతూ గ్రామంలోని తల్లిదండ్రులు వారి పిల్లలకు ఇంగ్లీష్ బాగా నెర్పుతారని ఆశతో లక్షలు వెచ్చించి ప్రక్క పట్టణాలకు పంపడం బాదాకరమని, వారికి దీటుగా మన ఊరి స్కూలలో కూడ ఇంగ్లీష్ నేర్పుతున్నమని, గురుకుల లో సీట్లు పొందడం మన పాఠశాల ముందు ఉందన్న విషయం తెలిసిందే అని, డిజిటల్ విద్యా కొనసాగే అవకాశం దాతలు అందించాలని వారు కోరారు. విద్యార్థులకు సహకరించిన బుస్సా శ్రీనివాస్, చందా క్రృష్ణమూర్తి, బచ్చువిక్రమ్, మంచికంటి మంగ, సుస్మిత లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పిట్ట రాంరెడ్డి , చిల్లా సురేష్ , ఉపాధ్యాయులు భద్రయ్య , శ్రీనివాసరావు , శేఖర్ రెడ్డి , రమేష్ , విద్యా రాణి , జ్యోతి , ఆర్గనైజర్ వేముల సైదులు , మిర్యాల రామకృష్ణ , చిల్ల మధు, నడిగోటి గణేష్ తదితరులు పాల్గొన్నారు.